VISALAANDHRA, VIJAYAWADA, PHONE: No 376

200356

విశాలాంధ్ర

సంపుటి 8] విజయవాడ • 18 డిసెంబరు 1959 • శుక్రవారం [సంచిక 249

[illegible] రిజిష్టరు నెం. A-193

DEPT. OF [illegible] GOVT. OF ANDHRA PRADESH
NEWSPAPER RECORDS
FILE COPY

[illegible] స్పెషలిస్టులు
మా వద్ద జీపు [illegible] విడిభాగములు బ్యాటరీలు దొరకును
రాపూస్ ఆటో స్టోర్సు
హెడాఫీసు [illegible] వరంగల్
బ్రాంచి ప్రకాశంరోడ్ గవర్నరుపేట
విజయవాడ-2

కేరళ కమ్యూనిస్టు ఎన్నికల ప్రణాళిక ప్రకటన

తిరువనంతపురం, డిసెంబరు 17

నేడిక్కడ బహిరంగపరచిన కేరళ కమ్యూనిస్టు ఎన్నికల ప్రణాళికలో రాష్ట్రానికి మూడవ ప్రణాళికా వ్యయం క్రింద 250 కోట్లు కేటాయించడం, కార్మికుల జీవన ప్రమాణాన్ని పెంచడం, వ్యవసాయోత్పత్తులను పెంచి, రైతాంగ వ్యవసాయ కార్మికుల జీవిత ప్రమాణాన్ని అభివృద్ధిపరచడం, రాష్ట్ర ప్రజల ప్రజాతంత్ర హక్కులను కాపాడి, విద్యా సంస్కృతులను పెంపొందించడం ముఖ్యాంశాలుగా ఉన్నాయి

డాక్టరు భోగరాజు పట్టాభి సీతారామయ్యగారి కాలధర్మం

ఆంధ్ర శాసనసభ సమావేశం వాయిదా: గాఢ సంతాపం వెలిబుచ్చుతూ తీర్మానం

పార్లమెంటు ఉభయ సభలలో ప్రస్తావన

(విశాలాంధ్ర విలేఖరి) హైద్రాబాద్, డిసెంబరు 17

అఖిలభారత కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు, మధ్యప్రదేశ్ మాజీ గవర్నరు, ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు అగ్రనాయకులలో ఒకరూ అయిన డాక్టరు భోగరాజు పట్టాభి సీతారామయ్యగారు కొద్ది అనారోగ్యం అనంతరం నేటి ఉదయం ఇక్కడ మరణించారు. ఆయన వయస్సు 80 సంవత్సరాలు.

వీరి మృతి వార్త తెలియగానే ఇక్కడ జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ శాసనసభా సమావేశాన్ని వాయిదా వేశారు. రాజ్యసభలోనూ, లోక్‌సభలోనూ వీరి మరణానికి సంతాపం వెలిబుచ్చుతూ ప్రస్తావనలు జరిగాయి. డాక్టర్ పట్టాభి సీతారామయ్యగారు 1880 నవంబరు 24 వ తేదీన జన్మించారు. బి. ఏ. డిగ్రీ పొందిన తరువాత వైద్య పరీక్ష ఎమ్. బి. సి. ఎమ్. లో ఉత్తీర్ణులై బందరులో 1906లో ప్రాక్టీసు పెట్టారు. జాతీయోద్యమంలో ప్రవేశించి 1916 లో వైద్య వృత్తి వదలి పెట్టారు. అనేక పర్యాయాలు కారాగారవాసం అనుభవించారు.

1929 - 30 నుండి 1948 వరకు కాంగ్రెసు కార్యవర్గంలో అనేకపర్యాయాలు సభ్యుడుగా వున్నారు. సహకార ఉద్యమంలో డాక్టర్ పట్టాభి ఎక్కువ కృషిచేశారు. బ్యాంకింగ్, భీమా వ్యాపారాలను ప్రోత్సహించారు. 1946 లో రాజ్యాంగ నిర్ణాయకసభ సభ్యులుగా ఉన్నారు. 1948-50 లో జైపూర్ కాంగ్రెసు అధ్యక్షులుగా ఉన్నారు. స్వదేశ సంస్థాన ఉద్యమానికి కూడా నాయకత్వం వహించారు. 1952 - 57 మధ్యప్రదేశ్ గవర్నర్‌గా పనిచేశారు.

డాక్టర్ పట్టాభిగారు రచించిన గ్రంథాలలో కాంగ్రెస్ చరిత్ర (1935) జాతీయ విద్య (1912), భారత జాతీయత (1918), భాషా ప్రయుక్త రాష్ట్రవిభజన (1916), భారతదేశంపై ఆర్థిక దండయాత్ర, ప్రపంచ రాజ్యాంగాలు; గాంధీ - గాంధీయిజం, గాంధీయిజం - సోషలిజం, "ఫెదర్స్ అండ్ స్టోన్స్" మొదలైనవి ఉన్నాయి.

డాక్టర్ పట్టాభిగారు ఒకసంవత్సరం నుండి అనారోగ్యంగా ఉంటూ వచ్చారు. గతనెల నుండి అనారోగ్యం హెచ్చింది. గత రాత్రి పరిస్థితి విషమించింది. వారి ఆఖరిగడియలు ప్రశాంతంగానే గడిచాయి. వారికి ఇద్దరు కుమారులున్నారు.

ఆంధ్రశాసనసభ సమావేశాలు జరుగుతూండటంవలన, వీరి మరణ వార్త సభలో తెలియగానే సభ్యులందరు విచారగ్రస్తులయ్యారు. సభ్యులందరు చివరిసారి వారిని సందర్శించడానికి వీలుగా స్పీకరు వెంటనే 1-30 గంటలకు సభను వాయిదా వేశారు.

డాక్టర్ పట్టాభి 1905 లో జాతీయోద్యమంలో చేరి అగ్రశ్రేణిలో నిలబడ్డారు. 1916 లోనే కాంగ్రెస్ వారికి ఆంధ్రరాష్ట్రానికి ప్రత్యేక రాష్ట్ర కాంగ్రెస్ వీరి కృషిఫలంగానే ఏర్పడింది. డాక్టర్ పట్టాభి 1937నుండి 1940వరకు రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులుగా పని చేశారు. ఎ. ఐ. సి. సి కి 1949 లో అధ్యక్షత వహించారు. కాంగ్రెస్ అధ్యక్షస్థానానికి సుభాష్ చంద్రబోస్‌తో పోటీచేసి ఓడిపోయారు. "పట్టాభి ఓటమి నా ఓటమి" అని గాంధీజీ వ్యాఖ్యానించారు.

బందరు జాతీయ విద్యాలయం, ఆంధ్ర ఇన్సూరెన్సు కంపెనీ, హిందూస్థాన్ ఇన్సూరెన్సు కంపెనీ, ఆంధ్రా బ్యాంకు, భారత లక్ష్మీ బ్యాంకు మొదలైన సంస్థల అభివృద్ధి చేయడంలో ప్రధాన పాత్ర నిర్వహించారు. చాలాకాలం కృష్ణాపత్రికతో వీరికి సంబంధం ఉంది. కాంగ్రెస్ చరిత్రకారుడుగా పట్టాభిగారు ఖ్యాతి చెందారు. "కాంగ్రెసుకు వైద్యుడు మాత్రకాడైతే బ్రాహ్మణుడు భాష్యకారుడయ్యాడు" అని గాంధీజీ చమత్కరించారు.

సంతాప తీర్మానం

శ్రీ భోగరాజు పట్టాభి సీతారామయ్యగారి మృతికి గాఢసంతాపం వెలిబుచ్చుతూ వారికుటుంబానికి సానుభూతిని తెలియజేస్తూ ఆంధ్ర శాసనసభ నేడు తీర్మానించింది.

ముఖ్యమంత్రి శ్రీ సంజీవరెడ్డి మాట్లాడుతూ, ఆంధ్రదేశంలో గత అర్ధశతాబ్దంలో డాక్టర్ పట్టాభివంటి వారు చాలా అరుదుగా కన్పిస్తారని అన్నారు. "ఆయన జీవితం సర్వసంపూర్ణమూ, ప్రయోజనకరమూ అయినది. జాతీయపోరాటంకాలంలో శ్రీ పట్టాభిగారు ముందు శ్రేణిలో పాల్గొన్నారు. వారి ఆత్మకు శాంతి కల్గుగాక" అన్నారు.

ప్రతిపక్ష ఉప నాయకుడు శ్రీ ఎల్లమందారెడ్డి తీర్మానాన్ని బలపరుస్తూ పట్టాభిగారి జీవిత విశేషాలను వివరించారు. ఆయన మృతికి సంతాపాన్ని వెలిబుచ్చారు. స్వతంత్రపక్ష నాయకుడు శ్రీ రాజేశ్వరరావుగారు కూడా సంతాపం వెలిబుచ్చారు.

స్పీకరు శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావుగారు మాట్లాడుతూ, డాక్టర్ పట్టాభిగారు జీవితంలోని అన్ని రంగాలలోను శోభించారని అన్నారు. ఇంతవరకు జీవించియున్న గొప్ప దేశనాయకులలో ఆయన ఒకరన్నారు.

ఆ తరువాత సభవారు ఒక నిముషం సేపు మౌనం పాటించి తమ శ్రద్ధాంజలి సమర్పించారు.

పార్లమెంటులో

డాక్టరు పట్టాభి మరణానికి సానుభూతిగా లోక్‌సభ నేడు ఒక నిముషం మౌనం పాటించింది.

స్పీకరు అయ్యంగార్ పట్టాభి దేశసేవను ప్రశంసిస్తూ ప్రసంగించారు.

రాజ్యసభ అధ్యక్షులు డాక్టర్ రాధాకృష్ణ నేటి సమావేశంలో పట్టాభి సీతారామయ్యగారి దేశసేవను ప్రస్తుతించారు.

ఆయన స్మృత్యర్థం సభికులు రెండు నిముషాలు నిలబడ్డారు.

"నా చిరకాల మిత్రుడు మరణించినందుకు నేనెంతో విచారిస్తున్నాను" అని శ్రీ సి. రాజగోపాలాచారిగారు మద్రాసులో ఒక ప్రకటన చేశారు.

పంచాయతీ సమితులకు గ్రాంటులు

హైద్రాబాద్, డిసెంబరు 16

ఈ సంవత్సరం గ్రాంటుల నిమిత్తం అనుబంధ పద్దుల క్రింద 10 లక్షల 87 వేల 800 రూపాయలను మంజూరు చేయవలసిందిగా ఆర్థిక మంత్రి నేడు శాసనసభలో ప్రతిపాదించారు.

వర్తమాన, ఆర్థిక సంవత్సరం నుండి పంచాయతీ సమితులకు గత జనాభా లెక్కల ప్రాతిపదికపై తల ఒక్కంటికి నాల్గు అణాల చొప్పున యివ్వడానికి ప్రభుత్వం నిర్ణయించింది. వెనుకబడిన ప్రాంతాలలో అవసరం కల్గిన పంచాయతీలకు కూడా ఇదేవిధంగా డబ్బు యిస్తారు. ఈ సంస్థలకు గ్రాంటులు యిచ్చే నిమిత్తం ఈ అనుబంధ పద్దులలో నామమాత్రపు గ్రాంటులను కేటాయించారు. ఢిల్లీ వ్యవసాయ ప్రదర్శనంలో ఆంధ్రస్టాల్‌కు 6 లక్షలు, తెలంగాణాలో ప్రభుత్వం తీసుకున్న కాలేజీలకు (2.5 లక్షలు), తుంగభద్ర ప్రాంతంలో మత్స్య పరిశ్రమాభివృద్ధికి 80 వేలు, హరిపట్నం తాలూకాలో ప్రభుత్వ భవనాల నిర్మాణానికి (1 లక్ష 50 వేలు) గ్రాంట్లు ఇందులో ఉన్నాయి.

నామకార్థం యిందులో ఉన్న గ్రాంట్లు: నిజాం పంచదార మిల్లు వద్ద వసతిగృహాల నిర్మాణం, రోడ్లు, రూముల నిర్మాణం, హార్సిలీ కొండలపై సౌకర్యాలు, కొత్త అగ్నిమాపక యంత్రాలు.

ఇండోనేషియాలో మిలిటరీ పరిపాలన

జకార్తా, డిసెంబరు 16

ఇండోనేసియా అధ్యక్షుడు డాక్టరు సోకర్నో నేడు దేశమంతటా యుద్ధ పరిస్థితిని ప్రకటించి, కాలనిర్ణయం లేకుండా మార్షల్‌లాను పొడిగించి, ఇంతవరకు, యీమార్షల్‌లా అమలుపరచే మూడు సాయుధబలాల అధికారాన్ని తానే స్వయంగా స్వీకరించారు.

అనేక ద్వీపాలతో కూడియున్న యీ రిపబ్లిక్‌లో పెద్ద పెద్ద ద్వీపాలలో చాలచోట్ల తిరుగుబాట్లు లేచినట్లు వార్తలు వస్తున్నాయి.

మొట్టమొదట 33 మాసాల క్రితం యీ మార్షల్ లాను దేశంమీద విధించారు. ఇప్పుడు కొన్ని మార్పులుచేసి మొత్తం మిలిటరీ, సివిల్ అధికారాలను రెంటినీ తానే స్వయంగా నిర్వహించడానికి పూనుకుంటూ అధ్యక్షుడు సోకర్నో ఒక డిక్రీ ప్రకటన చేశారు.

ఈ అధ్యక్ష ఉత్తరువు ప్రకారం ఏ పౌరుని అయినా సాయుధ దళాలలో కలిపి పనిచేయించడానికి వీలవుతుంది. దీనిని ఉల్లంఘించినవానికి మిలిటరీ క్రమశిక్షణ ప్రకారం తన విధులు వదలిపోయినవానిగా జరిగే శిక్షణా చర్య తీసుకొంటారు.

ఇరాన్, ఇరాక్ సరిహద్దు ఘర్షణలు

టెహరాన్, డిసెంబరు 16

ఇరాన్, ఇరాక్ సరిహద్దులో తగాదా ప్రాంతమైన షాత్-ఎల్-అరబ్ ప్రాంతంలో నిన్న జరిగిన కాల్పుల సంఘటన ఫలితంగా ఇరాన్ దేశపు సరిహద్దు దళాల బలగాలను పెంచారు.

ఈ ప్రాంతంలోనే షాత్-ఎల్-అరబ్ అనే నదివుంది; ఈనది, పర్షియా సింధుశాఖ ముఖద్వారంవద్ద ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన "అబదాన్" నూనె శుద్ధి కర్మాగారంవుంది. ఇప్పుడు దీని సంరక్షణార్థం ఇరాన్ అధికారులు ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకుంటున్నారు.

ఈ అబదాన్‌కు సమీపంలోవున్న మూడుమైళ్ళ వెడల్పున ఇరాన్ భూభాగం తమకు చెందాలని ఇరాక్ ప్రధాని మేజర్ జనరల్ అబ్దుల్ కరీం కాశిం కోరుతున్నారు. ఈ భూభాగం అసలు తమదేననీ, కాని 1937 లో ఒత్తిడిచేసి ఇరాన్ దఖలు పరచుకొన్నదనీ ఆయన వాదిస్తున్నారు.

రైల్వే కార్మికుల నిరసన ప్రదర్శన

వేతనాలకమిటీ సిఫార్సులకు అసమ్మతిగా

హైద్రాబాద్, డిసెంబరు 16

కేంద్ర వేతనాల కమిటీ సిఫార్సులకు నిరసన తెలుపుతూ నిన్న ఇక్కడ రైల్వే కార్మికులు పెద్ద ప్రదర్శన జరిపారు. మొదటి సారిగా మూడవ తరగతి ఉద్యోగులు కూడా నాలుగవ తరగతి ఉద్యోగులతో కలిసి ప్రదర్శనలో పాల్గొన్నారు. లాలగుడా వర్కుషాపుల నుండి అన్ని రైల్వే కార్యాలయాల దగ్గరకు ప్రదర్శనం జరిపారు. ఆ తరువాత బహిరంగసభ జరిగింది.

15 వేలమంది గృహనిర్మాణ కార్మికుల సమ్మె

హైద్రాబాద్,సికింద్రాబాద్‌లలోని 15 వేలమంది గృహనిర్మాణ కార్మికులు హెచ్చు వేతనాలు కోరుతూ సమ్మె చేశారు.

గృహనిర్మాణ కార్మికుల కనీస వేతనాల నిర్ణయ కమిటీ సమావేశం జరుగుతున్న కార్యాలయానికి వీరంతా ఊరేగింపుగా వెళ్ళి అక్కడ ఒక మెమోరాండం సమర్పించారు.

* * *

మాజీ సైనికులను పారిశ్రామిక కార్యక్రమాలలో పూర్తిగా వినియోగించుకోవాలని నెహ్రూ ఢిల్లీలో ఒక సభలో ప్రసంగిస్తూ అన్నారు.

వ్యవసాయ విశ్వవిద్యాలయం

హైద్రాబాద్, డిసెంబరు 16

ఆంధ్రలో ఒక వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని నెలకొల్పాలని ప్రదేశ్ ప్రభుత్వం ఆలోచించుచున్నది. ఈ విశ్వవిద్యాలయ స్థాపనకు సంబంధించిన వివరాల తయారీకి ఒక ప్రత్యేక ఆఫీసర్ నియామకానికి నేడు శాసనసభకు సమర్పించిన సప్లిమెంటరీ పద్దులో లాంఛనంగా ఒక వంద రూపాయల గ్రాంటును ఆర్థికమంత్రి ఉదహరించారు.

భోపాల్ సమ్మె పరిస్థితి

భోపాల్, డిసెంబరు 16

తమ ఆశయాలు నెరవేరేవరకు సమ్మెను సాగిస్తామని [illegible] మధ్యప్రదేశ్ ఉద్యోగుల సంఘ తాత్కాలిక అధ్యక్షుడు పరమానంద్ పటేరియా ఒక ప్రకటన చేశారు.

సమ్మె పరిష్కారం సాధించేందుకు భోపాల్‌లో ఒక పౌరకమిటీ ఏర్పడ్డది. సమ్మెను విరమించవలసిందిగా [illegible] ఒక విజ్ఞప్తి చేశారు.

తృతీయ ప్రణాళికలో కూడ సోమశిల ప్రాజెక్టు చేర్చరా?

శాసనసభలో ఇదమిద్ధంగా తేల్చిచెప్పలేనని మంత్రి సమాధానం

(విశాలాంధ్ర విలేఖరి)

హైద్రాబాద్, డిసెంబరు 17

సోమశిల ప్రాజెక్టును తృతీయ ప్రణాళికలో సైతం చేర్చేదీ, లేనిదీ నేడు ఆంధ్ర శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో పబ్లిక్‌వర్క్సుశాఖా మంత్రి శ్రీ జె. నరసింగరావుగారు నిర్ధారణగా చెప్పలేకపోయారు.

శ్రీ కె. వెంకటరెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి యిలా సమాధానం యిచ్చారు.

"సోమశిల ప్రాజెక్టు నిర్మాణానికి 8 లక్షల 56 వేలు అవుతుంది. ఇందువలన 17 వేల ఎకరాలు సాగులోకి వస్తుంది. ఈ పథకాన్ని కేంద్రానికి పంపించాము. ఇది బహుళార్థసాధక ప్రాజెక్టు అనీ, అందుచేత నీటిపారుదల శాఖకూడా దీనిని ఆమోదించాలన్నారు. నివేదికను మాకు తిప్పిపంపారు. తిరిగి పరిశీలనలు జరిపి ఖర్చు తగ్గేటట్టు చూడాలన్నారు. అందుచేత ఇప్పుడు సవరించిన అంచనాలను చీఫ్ ఇంజనీరు తయారు చేస్తున్నారు."

ఒక ఉపప్రశ్నకు మంత్రి సమాధానం యిస్తూ ద్వితీయ ప్రణాళికలో ఈ ప్రాజెక్టును చేర్చలేదనీ, మూడవ ప్రణాళికలో చేర్చడం విషయం ఇంకా చూడవలసి ఉందన్నారు.

కనపూర్ వరకు ఒక కాలువను సోమశిలలో భాగంగా త్రవ్వడానికి ప్రభుత్వం నిర్ణయించిందనీ, అయిదు నుండి పది లక్షల వరకు ఈ కాలువకు ప్రాథమిక ఖర్చులుగా కేటాయిస్తారనీ అన్నారు.

ఈ కాలువను నాగార్జునప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తారా? లేక సోమశిలలో భాగంగా నిర్మిస్తారా? అని శ్రీ ఎల్లమందారెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి "ఏదైనా ఒకటే" అని సమాధానం యిచ్చారు. (వి. వి.)

దొంగ అనే అనుమానంతో మేనల్లుని కాల్చివేత

చండీఘర్, డిసెంబరు 16

దొంగ అనుకొని ఒక ఆఫీసర్ తన మేనల్లుని కాల్చి చంపిన ఉదంతం ఇక్కడ వెల్లడయింది.

లక్నోలో చదువుతున్న ఒక విద్యార్థి చండీఘర్‌లో తన ఇంటికి వచ్చాడు. తల్లిదండ్రులకు ఆశ్చర్యం కలిగించాలనే ఉద్దేశంతో కిటికీ తలుపులగుండా ఇంట్లోకి చొరబడబోయాడు.

తల్లి దండ్రులు గాభరాపడి కేకలు పెట్టారు. పక్కనేవున్న సబ్ డివిజనల్ ఆఫీసరు, పిల్లవాని మేనమామ లేచి, దొంగ అనుకొని తుపాకి పేల్చాడు.

విద్యార్థి మరణించాడు.

బోధన్ న్యూస్‌ప్రింట్ ఫ్యాక్టరీ: స్థాపించగలమనే ఆశ లేదని మంత్రి వెల్లడి

హైద్రాబాద్, డిసెంబరు 16

అద్యతన భావిలో బోధన్‌వద్ద న్యూస్‌ప్రింట్ ఫ్యాక్టరీని (పత్రికలకు వినియోగించే కాగితం ఉత్పత్తిచేసే కర్మాగారం) స్థాపించగలమనే ఆశ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వదులుకొన్నదని ఆర్థికమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి నేడు శ్రీ యస్. శాంతిరెడ్డి అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పుతూ వెల్లడించారు.

అందువల్లనే ముఖ్యమంత్రి శ్రీ సంజీవరెడ్డి కనీసం మామూలు కాగితం మిల్లు నైనా అక్కడ స్థాపించాలని కేంద్రానికి సూచించారని ఆర్థిక మంత్రి అన్నారు. ఒక అనుబంధ ప్రశ్నకు సమాధానం చెప్పుతూ ఈ ఫ్యాక్టరీని ప్రభుత్వ రంగంలో స్థాపించే సమస్య లేదన్నారు.

రెవిన్యూబోర్డు భవిష్యత్తు

లోగడ ప్రభుత్వం నియమించిన [illegible] సంఘం, రెవిన్యూబోర్డు భవిష్యత్తునుగూర్చి తయారు చేసిన నివేదిక ప్రభుత్వానికి [illegible] చేరిందని శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య, విశ్వేశ్వరరావు మొదలగు వారడిగిన ప్రశ్నకు ఆర్థికమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి సమాధానం చెప్పారు. అయితే, నివేదికలోని విశేషాలు సభకు చెప్పడానికి ఆయన నిరాకరించారు.

వంశధార, నాగావళి నదులకు కరకట్టలు

శ్రీకాకుళం జిల్లాలో వంశధార నాగావళి నదులకు గట్టి కరకట్టలు ఈ ఆర్థిక సంవత్సరంలోనే నిర్మించాలని ప్రభుత్వం కృషిచేస్తున్నదని శ్రీ గున్నయ్య ప్రశ్నకు సమాధానం చెప్తూ పి. డబ్ల్యు. డి. మంత్రి వెల్లడించారు.

అబ్కారీ బకాయిలు

తెలంగాణా కల్లోలాలు చెలరేగిన సంవత్సరంలో అబ్కారీ కంట్రాక్టర్లు ప్రభుత్వానికి చెల్లించవలసిన కోటి 7 లక్షల రూపాయలు అబ్కారీ బకాయిలను ప్రభుత్వం రద్దుచేసిందని శ్రీ ధర్మభిక్షం అడిగిన ప్రశ్నకు ఎక్సైజుశాఖ నిర్వహిస్తున్న మంత్రి శ్రీ సంజీవయ్య సమాధానం చెప్పారు

శ్రీ ధర్మభిక్షం: చిన్న చిన్న కంట్రాక్టర్ల కొద్దిపాటి ఆస్తులను ప్రభుత్వం వేలంవేసి వారి బకాయిలను ప్రభుత్వం వసూలుచేసి, పెద్ద కంట్రాక్టర్ల జోలికి పోనిమాట వాస్తవమా కాదా? ఇందువల్ల పెద్ద కంట్రాక్టర్లు తప్పించుకొన్నారు కదా?

మంత్రి: 5 వేల రూపాయలకు పైబడి బకాయిలు చెల్లించవలసి వారందరూ ఈ నెలాఖరు లోపల తమ బకాయిలు చెల్లించాలని ప్రభుత్వం ఉత్తర్వు చేసింది. వీరివద్ద వసూలు కావలసిన మొత్తం 97 లక్షలు

పొగాకుపై ఎక్సైజు సుంకం

పొగాకుపై ఎక్సైజు సుంకాన్ని 8 అణాల నుండి అణాలకు తగ్గించవలసిందిగా కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం సిఫార్సు చేసిందిగాని, కేంద్రం 3 న. పై. మాత్రమే తగ్గించిందని వ్యవసాయమంత్రి శ్రీ తిమ్మారెడ్డి, శ్రీ విశ్వేశ్వరరావుగారి ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

ప్రయివేట్ వ్యక్తులు వడ్డీవ్యాపారం చేయకుండా నిషేధించాలనే బిల్లు ఇంకా ప్రభుత్వ పరిశీలనలో ఉన్నదని శ్రీ లక్ష్మణదాసు ప్రశ్నకు వ్యవసాయమంత్రి సమాధానమిచ్చారు.

విద్యార్థుల సమ్మెలు

న్యాయమైన కోర్కెలకొరకు విద్యార్థులు సమ్మెచేయడం క్రమశిక్షణకు విరుద్ధం. తమ ఇబ్బందులు విద్యాసంస్థ అధికారులకో లేక తల్లిదండ్రుల సంఘాలకో తెలియజేసుకోవచ్చు. అయితే, ఎట్టి పరిస్థితుల్లోనూ రాజకీయ నాయకులదగ్గరకు వెళ్ళి వారిని మొరపెట్టుకోకూడదని ప్రభుత్వం ఖచ్చితమైన ఉత్తర్వులిచ్చింది శ్రీ పతి లక్ష్మీకాంతమ్మ ప్రశ్నకు సమాధానమిస్తూ ఈ విషయాలను విద్యామంత్రి శాసనసభలో వెల్లడించారు

రైతులకు మరి సౌకర్యాలు

సహకార సంఘాల్లో ఆయా రైతులకు గల భూములను బట్టికాక వారి అవసరాలను బట్టి వారికి రుణాలు మంజూరుచేసే విధానాన్ని ప్రతి జిల్లాలోను 10 గ్రామాలలో అమలు జరిపి చూస్తారని సహకార మంత్రి ఒక ప్రశ్నకు సమాధానమిచ్చారు.

అక్రమంగా పన్ను ఎగవేత కేసులు

హైద్రాబాద్, డిసెంబరు 17

శ్రీ పతి లక్ష్మీకాంతమ్మ నేడు శాసన సభలో అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం యిస్తూ 1956-57 నుండి 1958-59 వరకు వరుసగా 1881, 3095, 2136 అక్రమంగా పన్ను ఎగవేత కేసులు పట్టుబడ్డాయని తెలియజేశారు. ఈ మూడు సంవత్సరాల్లోను, 31,74,623 రూపాయల పన్ను అక్రమంగా రాబట్టినట్లు తెలియజేశారు. ఎగవేతలు పట్టుకోవడానికి అదనంగా నియమించిన సిబ్బంది నిమిత్తం 4 లక్షల 24 వేలు అయిందనిఅన్నారు (వి.వి.)

* * *

[illegible] ఎన్నికలలో కొన్నిటిని మాత్రమే ప్రభుత్వం ఆమోదించటం జరిగిందని [illegible] ఒక ప్రకటన చేశారు.

"నాటో" సమావేశంలో ఫ్రాన్సు, అమెరికా విభేదాలు

ఇరుపక్షాల మధ్య తీవ్ర వాగ్యుద్ధం

పారిస్, డిసెంబరు 16

ఇక్కడ సమావేశమవుతున్న ఉత్తర అట్లాంటిక్ కూటమి దేశాల సభలో యీ కూటమి పట్ల ఫ్రాన్సు అనుసరించే వైఖరి అత్యంత తీవ్ర విమర్శకు గురి అయింది.

ఈవేళ ఉదయం సుదీర్ఘంగా ప్రసంగించిన ఫ్రాన్సు రక్షణమంత్రి పీర్ గిల్లామెట్ అనేకసార్లు తన స్థానంనుండి ఎగిరిపడిలేచి, తమ దేశంపై జరిగే విమర్శలకు అడ్డు [illegible].

"వాతావరణం అంతా ఉరుములు మెరుపులతో కూడివుంది" అని ఒక ప్రతినిధి తెలిపారు.

అన్ని ప్రతినిధివర్గాలూ కూడ యీ విషయమై గట్టిగా మౌనం వహించి [illegible]. కాని ఒక "నాటో" ప్రతినిధిమాత్రం విలేఖరుల ప్రశ్నలకు సమాధానమిస్తూ సమావేశానికి సంబంధించి, అదివరకు విభిన్న దృక్పథాల [illegible] విషయంమీద ఇకమీదట చర్చలు జరుగవని తెలిపారు.

కాని యీ సమస్యను "నాటో" రాజ్యాల శాశ్వత ప్రతినిధులు పరిశీలిస్తూ వుంటారు.

నేటి ఉదయం చర్చలలో యీ "నాటో"లోని 15 మంది మంత్రివర్గ సభ్యులు తమతమ బాధ్యతలను ఎంతవరకు నిర్వహించుకుంటున్నారనే సమస్యమీద చర్చ జరిగినప్పుడు అమెరికా, ఫ్రాన్సు దేశాల రక్షణ మంత్రుల మధ్య అతితీవ్రమైన వాగ్యుద్ధం జరిగింది.

ఈ "నాటో" దేశాల సైనిక వ్యూహ కార్యక్రమంలో ఫ్రాన్సు వెనుకంజ వేస్తున్నదని "నాటో"లో అమెరికా సైనిక అధిపతి జనరల్ [illegible] చేసిన నేరారోపణ, గత వారం సమావేశంలో [illegible] విషయమై జరిగిన ఓటింగ్‌లో అమెరికా ఎటూ పాల్గొనక పోవడం - యీ రెండు సమస్యలే మూల కారణాలని ఫ్రాన్సు [illegible] భావిస్తున్నాయి.

నేటి సమావేశంలో ఫ్రెంచి రక్షణ మంత్రి లేచి జనరల్ [illegible] చేసిన నేరారోపణపట్ల ఫ్రాన్సు వెలిబుచ్చిన తీవ్రనిరసనను "నాటో" రాజ్యాలన్నీ బలపరచాలని కోరారు.

దానిమీద అధికంగా జనరల్ [illegible] చేసిన ప్రసంగాన్ని పత్రికలకు ఎక్కడంపట్ల నిరసన తెలపడాన్ని అన్ని దేశాలు సమర్థిస్తాయని "నాటో" కార్యదర్శి పాల్ హెన్రీ స్పాక్ (డెన్మార్క్) చెప్పి, ఇక యీవిషయం అంతటితో ముగిసినట్లు భావించాలని కోరారు.

దీనిమీదట ఫ్రెంచి రక్షణమంత్రి లేచి, అలాంటి రాజకీయమైన విమర్శ చేసే హక్కు జనరల్ [illegible]కు లేదని, "నాటో" కార్యక్రమంలో ఫ్రాన్సు సహాయనిరాకరణ చేస్తున్నదనడం పూర్తిగా తప్పు అనీ విమర్శించారు.

వెంటనే అమెరికా రక్షణమంత్రి థామస్ గేట్స్ లేచి తమ ప్రభుత్వం రాజకీయ అధికారులమీద మిలిటరీ నాయకులు వత్తిడి తేవడాన్ని అంగీకరించదని చెప్పారు. అయినప్పటికీ, "జనరల్ [illegible] చేసిన ప్రసంగంలోని ప్రధాన విషయాన్ని మా ప్రభుత్వం ఆమోదిస్తున్నది. ఏ రాజకీయ నిర్ణయాలయినాసరే వాటి మిలిటరీ ప్రాముఖ్యాన్ని గురించి వ్యాఖ్యానించడానికి మా మిలిటరీ నాయకులకు సమర్థత, హక్కు, బాధ్యత వున్నదనే మా ప్రభుత్వం భావిస్తోంది" అన్నారు.

రాబోవు శనివారం నాడు ఫ్రాన్సు, అమెరికా విభేదాలపై చర్చించాలని ప్రెసిడెంటు డిగాల్, ప్రెసిడెంటు ఐసెన్‌హోవర్‌లు నిర్ణయించుకున్నారు.

వికారి నామ సంవత్సర
మార్గశిర బహుళ
తదియ మ. 2-31
పుష్యమి పూర్తి

విశాలాంధ్ర

శుక్రవారం 18-12-1959

వరకట్నాల నిషేధ బిల్లు

వివాహ సందర్భంలో నగలుగాని, వస్తు వాహనాలుగాని, ఆభరణాలుగానీ బహుమతిగా యివ్వవచ్చునని వరకట్న నిషేధ బిల్లుకు లోక్‌సభ జతపరచిన సవరణను రాజ్యసభ త్రోసిపుచ్చింది. ఇందుకు రాజ్యసభను అభినందించవలసియున్నది.

సమాజంలో వరకట్నాల బాధ జాస్తిగా వున్నమాట నిజం. అనేక అననుకూల దాంపత్యాలు ఏర్పడడానికీ, అనేక దాంపత్యాలు భగ్నమవడానికీ యీ కట్నాల బేరాలు కారణమవుతూన్నాయి. ప్రేమానురాగాలు, కుటుంబ బాంధవ్యాలు పెంపొందేబదులు నగదు బేరమే బంధుత్వమవడం దారుణం. కాని అనుకూల దాంపత్యానికి వేరుపురుగువలె నున్న యీ కట్నాల బేరాన్ని మొదలంట హతమార్చడానికి మన శాసనసభలు, పార్లమెంటు ఇప్పటికీ పూనుకోకపోవడం క్షంతవ్యంగాదు.

స్త్రీ పురుష జాతుల మధ్య వివక్ష చూపరాదని రాజ్యాంగ చట్టం ఆదేశించింది. కాని కుమారులతో పాటు కుమార్తెలకు గూడా సమాన ఆస్తి హక్కులు యీనాటికీ గుర్తించబడలేదు. ఈ మధ్య స్త్రీలకు వారసత్వ ఆస్తిపై కలిగించిన హక్కులు కూడా పాక్షికమైనవే గాని సమానత్వాన్నిస్తున్నవిగావు. నిజంగా కట్నాల బాధ తొలగిపోయి, ఉన్న ఆస్తిపై ఆధారపడి ఇష్టమైతే వివాహం నిశ్చయించుకోవడం లేకపోతే మానుకోవడం అప్పుడే జరుగుతుంది.

ఈ సంస్కరణను ప్రవేశపెట్టకుండా ఎన్ని నిషేధ చట్టాలను ప్రయోగించినా, ఆచరణలో వాటికి మిగిలేది నైతిక విలువ మాత్రమే. గతంలో రాష్ట్ర శాసనసభలు ఇటువంటి నిషేధ చట్టాలను చేశాయి. కాని ఆచరణలో కట్నాల బాధ తప్పలేదు. ఇప్పుడు దేశ వ్యాపితంగా అటువంటి చట్టాన్ని ప్రయోగించాలని కేంద్ర ప్రభుత్వం పూనుకుంది. ఇది ఎలా అమలు జరుగుతుందనేది బిల్లును ప్రవేశపెట్టిన వారికీ, పార్లమెంటు సభ్యులకూ ప్రశ్నార్థకంగానేవుంది. కాగా యీ శాసనం నైతికంగాగాని, భౌతికంగా గాని ఎంతవరకు కట్నాల బాధను తొలగించేందుకు ఉపయోగించినా అది హర్షించదగిన విషయమే. సాధ్యమైనంత ఉపయోగకారిగా వుండేట్టు ప్రజాప్రతినిధులు దాన్ని సవరించవలసిందే.

కాని లోక్‌సభ ప్రతిపాదించిన సవరణ అందుకు ఉపయోగించేదికాదు. పేరు కట్నాల నిషేధబిల్లు. కాని బహుమతుల పేరిట ఎంతకట్నం ఇచ్చినా ఇబ్బందిలేదు. ఇంకెందుకు ఆ బిల్లు? అయినా అదే లోక్‌సభ సవరణ సారాంశం. అమలు జరిపే మాటటుంచి, ఆ బిల్లుకున్న నైతిక విలువనుకూడా నిర్మూలించేదే ఆ సవరణ. ఆ సవరణను రాజ్యసభ తిరస్కరించడం చాలా సముచితంగా వుంది. మళ్ళీ లోక్‌సభ యీ సమస్యను చర్చించవలసియున్నది గనుక ఇప్పటికైనా ఆ సభ సరైన వైఖరి తీసికుంటుందని ఆశిస్తున్నాం.

కొత్తగూడెం ఫ్యాక్టరీ

ముఖ్యమంత్రి ప్రకటన

హైద్రాబాద్, డిసెంబరు 17

కొత్తగూడెంలో నెలకొల్పదలచిన ఎరువుల ఫ్యాక్టరీ గురించిన వివరాలను తెలుపుతూ ముఖ్యమంత్రి శ్రీ సంజీవరెడ్డి నేడు వ్రాతమూలకంగా సభవారికి ఒక ప్రకటనను అందజేశారు.

ఈ ఫ్యాక్టరీకి 80 వేల టన్నుల నైట్రేట్, 97 వేల టన్నుల అమ్మోనియం, 93 వేల 400టన్నుల నైట్రేట్ 72300 టన్నుల నైట్రిక్, యాసిడ్ 1,83,000 టన్నుల నైట్రోఫాస్ఫేట్ తయారుచేసే శక్తి ఉంటుంది.

అయితే ముందు 92400 టన్నుల యూరియా,1,83,000టన్నుల నైట్రోఫాస్ఫేట్లు తయారు చేస్తారు. దిగుమతి సరుకు ఖరీదులతో పోల్చితే ఈ రెండింటి విలువ షుమారు పది, పన్నెండుకోట్ల రూపాయలుఉంటుంది.

ఈ ఎరువుల ఉత్పత్తికి ముడిపదార్థం బొగ్గు. అయితే బహుశా యిందుకు ముక్కచెక్కలుగా ఉన్న బొగ్గును వాడవచ్చును.

ఫ్యాక్టరీ నిర్మాణానికి రు 24 కోట్లు అవుతుంది. ఇందులో 11 కోట్ల విలువ గల సామగ్రికి విదేశమారకం కావాలి.

ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఫ్యాక్టరీ నిర్మాణ స్థలాన్ని నిన్న తాను సందర్శించానని అన్నారు. మూడు నాలుగుకోట్లరూపాయలు ప్రజలనుండి వాటా ధనంగా వసూలు కావచ్చుననీ, వాటా రు.100 లు ఉంటుందని తెలియజేశారు. త్వరలోనే కంపెనీని రిజిష్టరు చేయిస్తామనీ, అన్ని కార్యక్రమాలు అనుకున్నట్టుగానే సాగుతున్నాయనీ అన్నారు. (వి. వి)

వేతనాల కమిటీ రెండవ నివేదిక

మున్సిపల్ ఉద్యోగుల సంఘ ప్రకటన

విజయవాడ, డిసెంబరు 15

రాష్ట్ర వేతనాల కమిటీ రెండవ నివేదికను గురించి రాష్ట్ర మునిసిపల్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘంవారు ఈ దిగువ ప్రకటన చేశారు.

"ఎన్. జి. వో. లకు,స్థానిక సంస్థల ఉద్యోగులకు స్కేళ్ళలో అంతరాన్ని తొలగించినందుకు ప్రభుత్వాన్ని ఈ సంఘం అభినందించుచున్నది. కాని ఈ వేతనాల హెచ్చింపును ఎ జి.ఓ లతో పాటు, తమకుకూడా 1958 నవంబరు నుండి అమలు జరపాలన్న కోర్కెను అంగీకరించనందుకు విచారం వెలిబుచ్చుతోంది. అందుచేత పై కోర్కెను అంగీకరిస్తూ ఇప్పుడైనాప్రకటించాలని కోరుతోంది."

20 వ తేదీన గుంటూరులో రాష్ట్ర మ్యునిసిపల్ ఉద్యోగుల సంఘ కార్యవర్గ సమావేశం జరుగనున్నదనీ ఆ సమావేశంలో ఈ సమస్యపై చర్చించనున్నదనీ, కార్యదర్శి తెలియజేశారు.

డాక్టర్ పట్టాభి

డాక్టరు భోగరాజు పట్టాభి సీతారామయ్యగారు తమ 80 వ ఏట అస్తమించినందుకు విచారిస్తున్నాం. తెలుగుదేశపు ప్రతిభావంతులలోవారొకరు. గొప్ప వక్త, రచయిత, విజ్ఞాన ఖని, దేశభక్తులు. జాతీయోద్యమ కాలంలో కాంగ్రెసు చరిత్రాత్మక పాత్రను చరిత్రగా రచయించారు. ఆంధ్ర దేశపు హద్దులు దాటి అఖిల భారత నాయకత్వ శ్రేణిలోచేరినవారు. జాతీయోద్యమంలో నిర్విరామంగా పనిచేస్తూ కూడా సహకారోద్యమాన్ని, బ్యాంకింగు వ్యాపారాన్ని పెంపొందించడానికి కృషి చేశారు.

డాక్టరు పట్టాభిగారికివేమా జోహారులు.

ఐసెన్‌హోవర్ పర్యటనపై "న్యూఏజ్" సంపాదకీయం

న్యూఢిల్లీ, డిసెంబరు 17

ఐసెన్‌హోవర్, భారత పర్యటన ఎంతో ఆశాపూరితమైన శాంతియుత ప్రసంగాలతో ప్రారంభమైనా, అది ముగిసిన తీరు మాత్రం ఆశాజనకంగాలేదని, వివరిస్తూ కమ్యూనిస్టుపార్టీ వార పత్రిక "న్యూఏజ్" డిసెంబరు 20 వ తేదీన వెలువడనున్న సంచికలో ఒక సంపాదకీయం వ్రాసింది.

న్యూఏజ్ పత్రిక సంపాదకీయ పాఠం ఇలా ఉంది:

లక్షలాది భారత ప్రజలు ఐసెన్‌హోవర్‌కు స్వాగతం ఇచ్చారు. ఢిల్లీ నగరవీధులు గుంపులతో నిండిపోయాయి. పారిశ్రామికాభివృద్ధికి, ధన సమృద్ధికి పేరుగాంచినదేశం అమెరికా. అలాంటి అమెరికా అధ్యక్షుని చూడాలనే కుతూహలం భారతప్రజలలో ఉంది. అంతేకాదు. అమెరికా అధ్యక్షులు శాంతినిగురించి, ప్రచ్ఛన్న యుద్ధ పరిసమాప్తిని గురించి ఆయుధాల తగ్గింపును గురించి మాట్లాడుతున్నారు. ఈ ప్రసంగాలు భారత ప్రజల వాంఛకు అనుగుణమైనవి. అందువలనకూడా ఐసెన్‌హోవర్ సందర్శనానికై ప్రజలుహెచ్చు కుతూహలం ప్రదర్శించారు.

శిఖరాగ్ర సమావేశం జరిగి, యుద్ధభీతి తొలగి, శాస్త్ర విజ్ఞానం మానవాభ్యుదయానికి తోడ్పడాలని భారత ప్రజలు వాంఛిస్తున్నారు. ఐసెన్‌హోవర్ తన ప్రసంగాలన్నింటిలోనూ, మొత్తంమీద శాంతి, సుహృద్భావ వాంఛను వ్యక్తం చేశారు.

పార్లమెంటు సభ్యులతో మాట్లాడుతూ, ఆయన ఇలా అన్నారు: "ప్రస్తుతం ప్రభుత్వాలు సైనిక రక్షణ వ్యయంపై హెచ్చు దృష్టి కేంద్రీకరించవలసివస్తున్నది. ఇందువలన ఉద్రిక్తత హెచ్చుతున్నది. ఫలితంగా శాంతియుతంగా అభివృద్ధి చెందే అవకాశాలు ప్రజలకు సన్నగిలుతున్నాయి. కాని శాంతి, న్యాయం, స్వేచ్ఛలపట్ల ప్రజావాంఛరోజురోజుకూ హెచ్చుతున్నది ఇందుకు పరిష్కార మేమిటి!

"కనుక విశ్వవ్యాపిత నిరాయుధీకరణ అవసరం. అయిదేండ్లపాటో, 50 ఏండ్లపాటో మనం నిరాయుధీకరణ ఒప్పందాలు చేసుకోలేమా? అనుమానాలను, ద్వేషాలను పక్కనుపెట్టలేమా? ఉద్రిక్తత తగ్గింపు చర్యలు తీసుకోలేమా!" అని ఐసెన్‌హోవర్ అన్నారు.

ఇవి నిజంగా చాలామంచిభావాలు. శాంతియుత సహజీవనానికి ఇవే పునాది.

అయితే ఈశాంతి వాంఛ ఐసెన్‌హోవర్ ప్రసంగాలలో తుది వరకూ ఇదే స్థాయిలోలేదు. ప్రపంచాన్ని యుద్ధపు అంచులకు నెట్టాలనే డల్లెస్ ధోరణి విఫలమైనా ఆ ధోరణిని సృష్టించిన విధానం ఫలితాలు అమెరికా అధ్యక్షునిపై ప్రసరిస్తూనే ఉన్నాయి. అలా కానిచో, డల్లెస్ యుద్ధోన్మాద విధానాల వైఫల్యానికి ప్రబల తార్కాణమైన కొరియా ఉదంతాన్నిగురించి ఐసెన్‌హోవర్ ప్రస్తావించేవారే కాదు. 'స్వేచ్ఛాప్రపంచం', 'అభివృద్ధి' అనే మాటలను పెట్టుబడిదారీ ప్రపంచానికి మాత్రమే పరిమితంచేసి ఆయన మాట్లాడి వుండేవాడు కాదు. ఆర్థికాభివృద్ధి సాధించే యత్నంలో 'ఒకే మూసలో', నడిపించడం కూడదని మనకాయన సలహా యివ్వనక్కరలేదు. 'స్వేచ్ఛ'పైన ఆధారపడి శాంతి సాధించాలి అని ఆయన చెప్పడంలో ఉద్దేశమేమిటి? సోషలిస్టు ప్రపంచంతో శాంతియుత సహజీవనం. 'స్వేచ్ఛ'కు విరుద్ధమనే సామ్రాజ్యవాదుల పాత ధోరణినే ఆయన ప్రదర్శిస్తున్నాడా? లేక ప్రధాని నెహ్రూ స్పష్టం చేసినట్లు ఆఫ్రికాలోని పెక్కుదేశాలకు సంబంధించి సంతవరకు మిగతా విషయాలన్నిటికంటె దాని సత్వం నుండి విముక్తి చెందటం ప్రథమ కర్తవ్యమని ఆయన భావిస్తున్నాడా? ప్రచ్ఛన్న యుద్ధం, బలవిధానాలపై ఆధారపడిన సామ్రాజ్యవాదుల పాత దృక్పథానికి, ప్రపంచ వ్యాపిత నిరాయుధీకరణ, విశ్వశాంతి, వలస దేశాల విముక్తి అనే కొత్త దృక్పథానికి మధ్య అమెరికన్ అధ్యక్షుని మనస్సులో తీవ్ర ఘర్షణ జరుగుతున్నట్లుంది.

ప్రధాని నెహ్రూ మాత్రం భారత దేశంలోని అభివృద్ధి నిరోధకులకు ఆశాభంగం కలిగించే విధంగా మాట్లాడారు. స్వేచ్ఛ, తటస్థ విధానం, ఎట్టి షరతులులేని ప్రపంచ శాంతి అనే మూడు లక్ష్యాలను పునరుద్ఘాటించారు. నైతికంగా తనకుగల ఉన్నత స్థాయి నుండి ఏమాత్రమూ కిందికి దిగటానికి నిరాకరించారు. తృతీయ ప్రణాళికకు ఆర్థిక సహాయం, చైనాతో వివాదం, కమ్యూనిజం ఈ మూడు సమస్యలపైన నెహ్రూ భారత ప్రభుత్వ వైఖరిని ఖచ్చితంగా స్పష్టం చేశారు.

అభివృద్ధి నిరోధకులకు ఆశాభంగం కలిగింది. పై సమస్యలన్నీ ఐక్ - నెహ్రూలు చర్చించారని, ఐసెన్‌హోవర్ పత్రికా కార్యదర్శి ప్రకటించగా ప్రధాని నెహ్రూ ఆ వార్తలను ఖచ్చితంగా నిరాకరించారు.

ఐసెన్‌హోవర్ రాకవల్ల అభివృద్ధి నిరోధక ఏ ఆశయాలు సాధించాలని ఆశించారో అవి నెరవేరలేదు. అయితే వారి ఆశలు పూర్తిగా వమ్ముగాలేదు.

ఒక దేశం అభివృద్ధిచెందాలంటే, విదేశీపెట్టుబడిదారుల రుణాలు చాలా అవసరమని ఐసెన్‌హోవర్ బహిరంగ సభలో ప్రకటించటం చాలా మోటుతరహాగా ఉంది. భారతదేశం ఒక పెట్టుబడికి అవకాశాలుగల గొప్ప దేశంగా తయారైందని ఇక ముందు ప్రతిచోటా ప్రచారం చేస్తానని ఐసెన్‌హోవర్ అనటం మరింత మోటుగా ఉంది. ప్రధాని నెహ్రూ ప్రదర్శించిన హుందాతనానికి, ఐసెన్‌హోవర్ మోటుతనానికి ఎంత వ్యత్యాసం!

ఢిల్లీ పౌర సన్మానానికి సమాధానంగా ఐసెన్‌హోవర్ చేసిన ప్రసంగంలో అమెరికన్ గుత్తపెట్టుబడిదారుల వాణి స్పష్టంగా వ్యక్తమైంది. వీరైతే భారతదేశాన్ని తిరిగి తమ వలస దేశంగా చేసుకోవాలనే ఆ వర్గాల ఉబలాటం, ఈ ప్రసంగంలో కనిపిస్తుంది.

తత్వవేత్త ఉపరాష్ట్రపతి అయిన డాక్టర్ రాధాకృష్ణన్ ఐసెన్‌హోవరును శాంతి దూత అని వర్ణించారు. అదే సందర్భంలో సైనిక ఒడంబడికలకంటే ఆదర్శాలమధ్య గల ఐక్యతే చాలా బలవత్తరమని కూడా నిర్మొహమాటంగా స్పష్టం చేశారు. అమెరికా అధ్యక్షులు, ప్రధాని నెహ్రూతో శాంతివిషయమై చర్చించటానికి వచ్చారని అన్నారు. ఇంత ఉన్నత స్థాయిలో ప్రారంభమైన ఐసెన్‌హోవర్. పర్యటన చాలా తక్కువ స్థాయిలో ముగిసింది.

రాధాకృష్ణన్ ఆహ్వానానికి ఐసెన్‌హోవర్ సంతోషించి ఉండవచ్చు. కాని ఆయన తిరుగు ప్రయాణంలో ఇరాన్ వెళ్ళినప్పుడు మాత్రం ఐసెన్‌హోవర్ రాధాకృష్ణన్ సలహాను మరచిపోయాడు. సెంటో సైనిక కూటమిని బలపరుస్తూ ఇరాన్ పార్లమెంటులో మాట్లాడారు.

ఎంతో ఆశాపూరితంగా ప్రారంభమైన ఐసెన్‌హోవర్ పర్యటనముగిసిన పద్ధతిమాత్రం ఆశాజనకంగా లేదు. అయినప్పటికీ, శిఖరాగ్ర సమావేశం జరిగే అవకాశాలు ఈనాటికీ ఉన్నాయని, అవి జయప్రదం కాగలవని మేము ఆశిస్తున్నాము.

— (న్యూఏజ్)

భద్రాచలం వంతెనకు ప్రారంభం

హైద్రాబాద్, డిసెంబరు 16

భద్రాచలంవద్ద నిర్మించదలచినవంతెనకు ముఖ్యమంత్రి శ్రీ సంజీవరెడ్డి నేడు శంకుస్థాపన చేశారు ఈ వంతెన నిర్మాణానికి రు. 57/- లక్షలు అవుతుంది.

1962 నాటికి నిర్మాణం పూర్తి అవుతుంది. కేంద్రప్రభుత్వం వంతెన నిర్మాణానికి రు. 28/- లక్షలు యివ్వడానికి అంగీకరించింది. వంతెన పొడుగు 3981 అడుగులు, 24 అడుగుల వెడల్పు 24 ఖానాలుంటాయి. ఈ వంతెన ఏర్పడితే మధ్యప్రదేశ్, ఒరిస్సా రాష్ట్రాలతోను, భద్రాచలంచుట్టుపట్ల గిరిజన ప్రాంతాలతోను రాకపోకలు వృద్ధి అవుతాయి.

ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఈ వంతెన నిర్మాణం 1957బోటు ప్రమాదంలో మరణించిన 208 మంది స్మృతికి చిహ్నంగాఉండగలవన్నారు. భద్రాచలం - వెంకటాపురముల మధ్య పక్కారోడ్డునుకూడాత్వరలో నిర్మించదలిచామన్నారు. (వి. వి)

టర్కీలో అణ్వాయుధనిల్వలు

రక్షణమంత్రి ప్రకటన

పారిస్, డిసెంబరు 16

అమెరికాలో తయారైన మధ్యరకం అణ్వాయుధాల దళాన్ని (స్క్వాడ్రన్) ఒకదానిని టర్కీలో నిలవ వుంచడానికి తమ ప్రభుత్వం అనుమతించిందని టర్కీ రక్షణమంత్రి ఎథెమ్ మెండరీస్ నేడిక్కడ "నాటో" సమావేశంలో తెలిపారు.

సవరణ

హైద్రాబాదు, డిసెంబరు 17

శ్రీ కందుల ఓబులరెడ్డిగారు కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు డిసెంబరు 17 విశాలాంధ్రలో ప్రకటించాము. అది పొరపాటు. కాంగ్రెస్ పార్టీలోచేరినవారు శ్రీ చంద్ర ఓబుల రెడ్డి. పొరపాటుకు చింతిస్తున్నాము.

ఆహార పరిస్థితిపై లోక్‌సభ చర్చ

శ్రీ తంగమణి ప్రత్యామ్నాయ తీర్మానం

న్యూఢిల్లీ, డిసెంబరు 16

నేడు లోక్‌సభలో దేశంలోని ఆహార పరిస్థితిపై చర్చను ఆరంభిస్తూ "సమంజసమైన కాలపరిమితిలో భారతదేశంలో ఆహార స్వయం సమృద్ధిని సాధించడమే నా పవిత్రవిధి" యని ఆహార మంత్రి శ్రీ ఎస్. కె. పాటిల్ ప్రకటించారు.

"గ్రామీణ ఉత్పత్తులవిషయమై తగు విధమైన శ్రద్ధ తీసుకోవడం ఇంతవరకు జరగలేదు. మూడవ ప్రణాళికా కాలంలో దీని విషయమై నేను చేయగలిగినదంతా చేస్తాను. అప్పుడు మనకు ఆహారంలో స్వయంసమృద్ధి ఏర్పడుతుందని, బయటనుంచి ఆహార ధాన్యాలు తెచ్చుకునే అవసరముండదనీ ఆశిస్తున్నాను" అన్నారు.

శ్రీ పాటిల్ తమ ప్రసంగంలో ఇదివరకటి వలెనే అందరకు తెలిసిన విషయాలనే తరచారు. ఇందులో ఆయన సూచించిన ఒక "నిర్దిష్టమైన ప్రతిపాదన" ఏమిటంటే ఎక్కడైనా బంజరు వున్నపుడు ఎవరైనా దానిని సాగుచేయడానికిఅవకాశంకల్పించడం. ఇప్పటికీ దేశంలో ఐదు కోట్ల ఎకరాల బంజరు భూమి వున్నది అయినప్పటికీ దానిని రాష్ట్ర ప్రభుత్వాలుగాని, వ్యక్తులుగాని ఉపయోగించడంలేదు.

అలాగే నీటిముంపుకు లోనైన భూమి 10లక్షల ఎకరాలుంది.ఇందులో మూడులక్షల 10 వేల ఎకరాలు ఒక్క పంజాబులోనే వుంది. ఈ రకం భూములలో అనువైన మురుగు వసతులు సృష్టించి, వాటిని సాగుకు లాయకీగా మార్చడానికి ఆహార మంత్రిత్వశాఖ త్వరలోనే "కొరడాలు" చేపట్టనుందని శ్రీ పాటిల్ తెలిపారు.

ప్రైవేటు పరిశ్రమదారులు ముందుకొచ్చి, రసాయనిక ఎరువుల ఉత్పత్తి చేపట్టాలని కోరారు.

శ్రీ తంగమణి ప్రత్యామ్నాయ తీర్మానం

ఈ చర్చలో పాల్గొన్న కమ్యూనిస్టు సభ్యుడు శ్రీ కె. టి. కె. తంగమణి ప్రభుత్వ వ్యాపారంగురించి ఆహార మంత్రి తీసుకున్న వైఖరిని విమర్శించారు. ఈ విషయంలో ప్రధానమంత్రి అనేకసార్లు నొక్కి నొక్కి [illegible]న్నప్పటికీ శ్రీ పాటిల్ క్రిందనున్న శాఖమాత్రం ఎలాంటినిర్దిష్టమైన వైఖరిని అవలంబించలేదన్నారు.

దీనిపై ఏమీ చెబుతున్నప్పటికీ ఈ ఏడాదిలో "ఇదిగో, ఇంత ఉత్పత్తి జరుగుతుంది" అనే ఒక ఖచ్చితమైన లక్ష్యాన్ని ఆహారమంత్రి ప్రకటించగలరా అని ప్రశ్నించారు.

శ్రీ తంగమణి ఒక ప్రత్యామ్నాయ తీర్మానాన్ని ప్రతిపాదించారు:

"దేశంలోని ఆహారపరిస్థితిని గురించి పరిశీలించిన తర్వాత ఆహారవస్తువుల ధరలు పెరగకుండా నిరోధించడంలోను,/ ధరల స్థిరీకరణకోసం తగిన యంత్రాంగాన్ని నెలకొల్పి ఆధరలను ప్రజల కొనుగోలు శక్తికి తగినట్లు చేయడంలోను, జాతీయ అభివృద్ధి సంఘం నిర్ణయించిన ప్రకారం ఆహార ధాన్యాలలో ప్రభుత్వ వ్యాపారాన్ని అనుసరించడంలోను, దానిని అమలుపరచడానికి తగిన పద్ధతులను చేపట్టడంలోను ప్రభుత్వం విఫలమైందని యీ సభవారు భావిస్తున్నారు.

"దేశంలోపలనే ధాన్యసేకరణజరిపి ఆహార బ్యాంకులను స్థాపించడంలోను, ప్రస్తుతం విదేశాలనుంచి దిగుమతి చేసుకొనే విధానాన్ని మార్చడంలోను, సహకార వ్యవసాయాన్ని పెంపొందింపడంలోను, భూకమతాలకు గరిష్ట పరిమితి నిర్ణయించి, అదనపు భూమిని భూమిలేని వారికిచ్చి ఆహారోత్పత్తికి తోడ్పడడంలోను ప్రభుత్వం విఫలమైంది"

శ్రీ ఎస్. కె. పాటిల్ ప్రతి రాష్ట్రానికి ఎరువుల ఫ్యాక్టరీలను ఇస్తామని వాగ్దానాలైతే విరివిగానే చేస్తున్నారు. గాని, అలాంటి అవసరమున్న ఆంధ్ర, మద్రాసు రాష్ట్రాలలో ఏ ప్రోత్సాహ మిచ్చారని శ్రీ తంగమణి ప్రశ్నించారు. కొత్తగూడెంలో ఆంధ్ర ప్రభుత్వం నిర్మించబోయే ఎరువుల ఫ్యాక్టరీకి కేంద్రం పూర్తిగా సహాయపడి, దాని నిర్మాణాన్ని పూర్తి చేయడానికి తోడ్పడుతుందనే హామీనివ్వాలని కోరారు.

దక్షిణాన కేరళ, మైసూరు రాష్ట్రాలలో ఆహారకొరత 10 లక్షల టన్నులవరకు వుంటుందనీ, అందుచేత దక్షిణ మండలంలో ఆహార పరిస్థితి ఆందోళనకరంగా వుందనీ తెలిపారు. దనిపై కేంద్రప్రభుత్వం రాష్ట్రప్రభుత్వాలు విభిన్నమైన విధానాలు అనుసరించడాన్ని విమర్శించారు.

ముంద్రాపై పెట్టబడిన కేసులను కొట్టివేసి కలకత్తా మేజిస్ట్రేటు ఆయనను విడుదలచేశారు.

◆ ◆ ◆

జయప్రకాశ్ నారాయణ విదేశాల పర్యటన ముగించుకొని నేడు పాట్నా చేరుకున్నారు.

దక్షిణాఫ్రికా వస్తు బహిష్కరణోద్యమం

బ్రిటిష్ లేబర్‌పార్టీ సమర్థన

లండన్, డిసెంబరు 16

దక్షిణాఫ్రికాలో అనుసరిస్తున్న జాతి విచక్షణకు నిరసనగా దక్షిణాఫ్రికా వస్తువులను బహిష్కరించాలనే ఉద్యమాన్ని తమ పార్టీ సభ్యులందరు బలపరచాలని విజ్ఞప్తి చేస్తూ బ్రిటిష్ లేబరుపార్టీ కార్యవర్గంనేడొక ప్రకటన చేసింది.

ఈ లేబరుపార్టీలో 65 లక్షలమంది సభ్యులున్నారు. ఇటీవల జరిగిన బ్రిటిష్ ఎన్నికల్లో యీ పార్టీకి ఒకకోటీ 25 లక్షల ఓట్లు లభించాయి.

"1960 సంవత్సరం ఆరంభంలో ఒక నెలరోజులు దక్షిణాఫ్రికావస్తువుల బహిష్కరణోద్యమాన్ని నడపాలని దక్షిణాఫ్రికాలో నిర్ణయించారు.

"జాతి విచక్షణా విధానమనే దుష్ట విధానానికి వ్యతిరేకంగా పోరాడే వారితో సంఘీభావం ప్రకటించడమే యీ వస్తు బహిష్కరణయని గుర్తిస్తూ ఆ ఉద్యమాన్ని యీ జాతీయ కార్యవర్గం హర్షిస్తోంది. తన పార్టీ సభ్యులందరు బలపరచాలని విజ్ఞప్తి చేస్తోంది" అని ఆ ప్రకటనలో తెలిపారు.

కాశ్మీర్ పై అయూబ్ ప్రసంగం

పాకిస్తాన్‌కు జీవన్మరణ సమస్యగా చిత్రణ

కరాచీ, డిసెంబరు 16

అబోటాబాద్‌లో ఒక బహిరంగ సభలో ప్రసంగిస్తూ కాశ్మీరు సమస్య "పాకిస్తాన్‌కు జీవన్మరణ సమస్యగానే" వుంటుందనీ, దీనిని పరిష్కరించుకోడానికి, భారత ప్రధానితో సమావేశమై చర్చించడానికి తానెపుడూ సంసిద్ధమేననీ పాకిస్తాన్ అధ్యక్షుడు అయూబ్ ఖాన్ చెప్పారు.

ఇంకా ఇలా అన్నారు:

"ఈ కాశ్మీర్ విషయంలో మాకు చాల గాఢమైన శ్రద్ధవుంది. మొదటిది మనకు కాశ్మీర్ ప్రజలంటే శ్రద్ధవుంది. అసలు మనదేశ రక్షణలో దానికున్న ప్రాముఖ్యం దృష్ట్యానే గాక దానికి సంబంధించిన ఇతర విషయాలను కూడ విస్మరించలేము. అక్కడి నీరు, నదుల సమస్య పాకిస్తాన్‌కు అత్యంత ముఖ్యమైంది. పాకిస్తాన్ కోసమని కేటాయించబడిన మూడు నదులు కూడా కాశ్మీర్‌లోనే పుడుతున్నాయి. నిజం చెప్పాలంటే, సరియైన వరద నిరోధం, నీటి పారుదల వినియోగం జరగాలంటే ఆ పనిని కాశ్మీర్ కొండలలోను, పశ్చిమ పాకిస్తాన్ మైదాన ప్రాంతాలలోను జరపాలి. ఈ విషయాలన్నీ కూడా యీ కాశ్మీర్ సమస్యను పాకిస్తాన్‌కు ఒక జీవన్మరణ సమస్యగా చేస్తున్నాయి.

"నేను శ్రీ నెహ్రూను,మరికొందరు బుద్ధిమంతులైన భారత నాయకులను కలుసుకొన్నాను. మన దృక్పథమేమిటో యీ నాయకులకు విశదీకరించడానికి మా శాయశక్తులా కృషి చేస్తున్నాం; యీ సమస్యను పరిష్కరించే అవసరాన్ని వారు గుర్తించేలాగ చేయప్రయత్నిస్తున్నాం. ఈ సమస్యను పరిష్కరించకుండా వదలివేయడం జరిగితే అది చివరకు యీ ఉభయదేశాల వినాశనానికే దారితీస్తుంది; ఈ దేశాలు తమ స్వాతంత్ర్యాన్నీ కోల్పోవలసి రావచ్చును" అన్నారు.

ఒక విలేఖరి అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ తాను అమెరికా అధ్యక్షునితో యీ సమస్యపై సంభాషించినప్పటికీ, దీనిపై ఆయన ఏదో ఒక నిర్ణయం చేయగలడనుకోవడం తప్పు అనీ, ఇది రెండు స్వతంత్రదేశాల మధ్య సమస్య కాబట్టి యీ దేశాలే పరిష్కరించుకోవాలనీ అధ్యక్షుడు అయూబ్ ఖాన్ చెప్పారు.

సింహళ ఎన్నికల్లో 18 పార్టీలు

కొలంబో, డిసెంబరు 16

1960 మార్చిలో సింహళదేశంలో జరుగబోయే పార్లమెంటు ఎన్నికలలో పాల్గొనడానికి 18 పార్టీలను ఎన్నికల కమిషన్ గుర్తించింది. వాటికి ఎన్నికల చిహ్నాలను కూడ కేటాయించింది.

ఈ పార్టీలలో ప్రధాని విజయానంద దహనాయకే కొత్తగా స్థాపించిన "లంక ప్రజాతంత్రవాది పక్షం" ఒకటి. దీనితోపాటు సింహళ టీ,రబ్బరు తోటల కార్మికులలో అత్యధికంగా వున్న భారత కార్మికులకు ప్రాతినిధ్యం వహించే సిలోన్ డెమోక్రటిక్ కాంగ్రెస్‌కూడ యీ ఎన్నికల్లో పాల్గొంటున్నది.

మాజీప్రధాని కీ. శే. బండారు నాయకే స్థాపించిన శ్రీ లంక ఫ్రీడం పార్టీకి హస్తం గుర్తును, దహనాయకే స్థాపించిన లంక ప్రజాతంత్రవాద పక్షానికి గొడుగు గుర్తును, సిలోన్ కమ్యూనిస్టుపార్టీకి నక్షత్రం గుర్తును ఎన్నికల కమిషన్ కేటాయించింది.

ఇజ్రాయిల్ లో పంచపక్ష ప్రభుత్వం

బెన్‌గూరియన్ ప్రధానమంత్రి

జరూసలెం, డిసెంబరు 16

ఐదుపార్టీలతో కూడిన మిశ్రమ మంత్రివర్గాన్ని ఏర్పరచిన ప్రధానమంత్రి బెన్ గూరియన్, ఇజ్రాయిల్ పార్లమెంటులో నేడు తమప్రభుత్వంపై విశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.

తమ ప్రభుత్వంలో కొత్తవారిని చేర్చుకున్నా, వారి రాజకీయాలలో మార్పేమీలేనివిధంగా బెన్ గూరియన్ ఈ మంత్రివర్గాన్ని ఏర్పరచారు.

అరబ్ దేశాలతో ప్రస్తుతమున్న యుద్ధవిరమణ ఒప్పందాల స్థానంలో నిరాక్రమణ సంధులు చేసుకోవాలనీ, మధ్యాసియాలో నిరాయుధీకరణ జరిపి అరబ్ దేశాలకు, తమ ఇజ్రాయిల్‌కు మధ్య విరోధాన్ని అంతమొందించాలనీ తమ విధానంగా వుంటుందని ప్రకటించారు.

శ్రీశైలంలో పాదరసం?

హైద్రాబాద్, డిసెంబరు 17

నేడు శాసనసభలో శ్రీ కల్లంకి విశ్వేశ్వరరావుగారు అడిగిన ప్రశ్నకు ముఖ్యమంత్రి సమాధానం యిస్తూ శ్రీశైలం ప్రాంతంలో పాదరసం లభ్యమయ్యే అవకాశాలున్నట్టు తాను కూడా విన్నాననీ, ఈ విషయం భూగర్భ పరిశోధనసంస్థ వారికి తెలియపరిచామనీ అన్నారు. (వి. వి)

హయ్యర్ గ్రేడ్ ట్రైనింగు పునరుద్ధరణ

శాసనసభలో విద్యామంత్రి ప్రకటన

(విశాలాంధ్ర విలేఖరి)

హైద్రాబాద్, డిసెంబరు .7

తృతీయ ప్రణాళికలో నిర్బంధ ప్రాథమిక విద్య పథకాలను అమలుచేయవలసిన అవసరం దృష్ట్యా హయ్యర్ గ్రేడ్ ట్రైనింగ్‌ను పునరుద్ధరించుతున్నామని విద్యామంత్రి శ్రీ పట్టాభి రామారావుగారు నేడు శాసనసభలో తెలియజేశారు.

శ్రీ ఆంథోనిరెడ్డి అడిగిన ప్రశ్నకు సమాధానం యిస్తూ మంత్రి పై విషయం తెలిపారు.

శ్రీ జి. ఎల్లమందారెడ్డి ఉపప్రశ్న వేస్తూ, ప్రస్తుతం నిరుద్యోగులుగా ఉన్న వేలాది సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు ముందు ఉద్యోగాలు చూపిస్తారా? అని అడిగారు.

"వారి ప్రవర్తన సరిగ్గా ఉంటే వారికి ముందు అవకాశం చూపించబడుతుందని అన్నారు.

తాను ఏకొద్దిమందినో గురించి అడగటం లేదనీ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజీలలో ఉద్యోగాలకోసం దరఖాస్తులు పెట్టుకొని, డి. ఇ. వో ఆఫీసులచుట్టూ తిరుగుతున్న వేలాది ఉపాధ్యాయులను గురించి మాటాడుతున్నానని శ్రీ ఎల్లమందారెడ్డిగారు అడిగారు. 'ప్రవర్తన' సమస్య యీ సందర్భంలో లేనేలేదన్నారు.

మంత్రి దానికి సమాధానం యివ్వలేదు.

తెలంగాణాలో వెట్టి చాకిరి

హైద్రాబాద్, డిసెంబరు 17

ఖమ్మంజిల్లాలో ఒక గ్రామంలో పంచాయతీ సమావేశానికి హాజరైన ఒక హరిజన సభ్యుని వెట్టిచాకిరీ నిమిత్తం సబ్ఇన్‌స్పెక్టరు దౌర్జన్యంగా తీసుకొనిపోయిన ఉదంతాన్ని కమ్యూనిస్టుసభ్యుడు శ్రీ నాయన పెద్దన్న నేడు శాసనసభలో వెల్లడించారు. అయితే తెలంగాణాలో ఎక్కడా వెట్టిచాకిరీ లేదని, ఇటువంటి ప్రత్యేకఉదాహరణలుంటే తాను చర్యతీసుకుంటానని హోంశాఖామంత్రిఅన్నారు. (వి.వి)

పశ్చిమరాజ్యాల శిఖరాగ్ర సమావేశం

పారిస్, డిసెంబరు 17

ప్రాక్పశ్చిమదేశాల అగ్రనాయక సమావేశాన్నిగురించి చర్చించేటందుకై యీ వారాంతాన అధ్యక్షుడు ఐసెన్‌హోవర్, జనరల్ డిగాల్, హెరాల్డు మాక్మిలన్, డా॥ కోన్రాడ్ అడినోవర్‌లు నాల్గుసార్లు సమావేశమై చర్చలు జరుపనున్నారని నేడిక్కడ అధికారయుతంగా ప్రకటించారు.

ఈ పశ్చిమరాజ్యాల అధినాయక సమావేశ కార్యక్రమంలో ఫ్రెంచి అధ్యక్షుడు డిగాల్ వేరే విడివిడిగా అమెరికా, బ్రిటన్, జర్మనీ అధినేతలతో సంప్రదింపులు జరుపడంకూడా ఒక భాగమని తెలిపారు.

శ్రీ హరి సర్వోత్తమ రావుగారి ఆరోగ్యం

విజయవాడ, డిసెంబరు 17

ఆంధ్రగ్రంథాలయోద్యమ నాయకులయిన శ్రీ గాడిచర్ల హరిసర్వోత్తమ రావుగారి ఆరోగ్యంఆందోళనకరంగా ఉన్నందున వారిని కలుసుకొనేందుకు గ్రంథాలయ సంఘ కార్యదర్శి శ్రీ పాతూరు నాగభూషణం గారు నేటి ఉదయం మద్రాసు బయలుదేరి వెళ్ళారు.

కమ్యూనిస్టుపార్టీ ఆఫీసుకు భూమి విరాళం

ఖమ్మంమెట్టు, డిసెంబరు 15

ఖమ్మం తాలూకా కొదుమూరు గ్రామంలో కమ్యూనిస్టుపార్టీ ఆఫీసు నిర్మాణము కొరకు రు 15 వందలు కావాలని అంచనా వేసి గ్రామ కమ్యూనిస్టుపార్టీ ప్రజలకు విజ్ఞప్తి చేసింది. ఆఫీసుకు అవసరమైన స్థలమును రు 200 లు ఖరీదుగలదాన్ని విరాళంగా యిచ్చుటకు శ్రీ రంగు బొట్ల రామకృష్ణయ్యగారు వాగ్దానం చేసి అప్పటికప్పుడు స్థలాన్నిచ్చారు. ఈనెల 13 న ఆఫీసుకు శంకుస్థాపన చేయబడింది. గ్రామ రైతులు, వ్యవసాయ కార్మికులు ఆఫీసు నిర్మించుకొనుటకై ఉత్సాహవంతంగా పని చేస్తున్నారు. (వి. వి.)

విద్య ఉపయోగకరంగా ఉండాలంటే, జీవితానికి అనుగుణంగా మారుతుండాలని చింతామణి దేశముఖ్ ఒక ప్రకటన చేశారు.

బరువులు మోసే గాడిదలపై నిషేధం

పౌర జీవితం బంద్

మాస్కో, డిసెంబరు 16

సోవియట్ యూనియన్‌తో మధ్యాసియా రిపబ్లిక్ ఉజ్బెకిస్తాన్‌కు చెందిన "అందిఝాన్" అనే నగరంలో పౌర జీవితమంతా స్తంభించిపోయింది.

కారణం, యీ నగరంలో సరుకుల రవాణాచేసే వాహనాలన్నీ గార్దభాలే కావడంవల్ల అవి "కొంచెం అనాగరికమైనవీ; నగర పారిశుధ్యాన్ని పాడు చేస్తున్నాయి" గనుక వాటిని ఉపయోగించరాదని అధికారులు నిషేధించారు.

ఈ విషయాన్ని నేడు సోవియట్ ప్రభుత్వపత్రిక "ఇజ్వెస్తియా" ప్రకటిస్తూ ఆనగరం అధికారులు యీ రకమైన పురాతన రవాణా సాధనందూచి సిగ్గుపడుతున్నారనీ, యీ అణుయుగంలో గాడిదమోతను చాల అసందర్భంగా భావించుతున్నారనీ తెలిపింది.

అయితే యీ నిషేధం అమలుకు రావడంతో మరోరవాణా సాధనం ఏదీలేని అందిఝాన్ పౌరులు తమతమ సరుకులన్నీ మూపులపై వేసుకొనే తిరుగవలసి వచ్చింది.

అందిఝాన్ అధికారులు యీ గాడిదల రవాణా చూచి సిగ్గుపడడాన్ని "ఇజ్వెస్తియా" కొప్పడింది; ఆలుగడ్డల సంచులు, భవననిర్మాణ సామగ్రి, వగైరా భారీవస్తువులను ప్రజలచేత మోయించేకంటే యీ వాహనాలనే ఉపయోగించడం చాల శ్రేష్టమని సలహానిచ్చింది.

రేడియో

శనివారం, డిసెంబరు 19

విజయవాడ

357.1 మీ (840 కిలోసై)

ఉదయం: 6-30 శుభోదయం; 6-35 ప్రసారవిశేషాలు,వాద్యసంగీతం; 6-40 భక్తిరంజని; 7-0 తె. వా; 7-15 శ్రీరంగం గోపాలరత్నం; 7-45సంగీతశిక్షణ; 8-0 ఆం. వా; 8-15 హిం. వా; మధ్యాహ్నం: 12-30 కార్మికులకు (హై. వి.), 1-0 వనితావాణి; 1-30 భక్తికీర్తావళి; 1-50 తె. వా; 2-0 పిల్లలకు సంగీతశిక్షణ; 2-20 బొమ్మరిల్లు; సాయంత్రం: 6-0 స్థానిక ప్రకటనలు; 6-5 ప్రాం. వా; 6-15 గ్రామస్థులకు; 7-0 తె. వా; 7-15 గ్రామస్థులకు; 7-30 హిందీ సాహిత్య పరిచయము; 7-40 ఫిల్మ్‌సంగీతం; 8-0 శ్రీరంగం గోపాలరత్నం; 8-30 రేడియో న్యూస్‌రీల్ (ఢి. వి); 8-40 సుగమ్‌సంగీత్, 9-0 ఆం. వా; 9-15 హాస్యవల్లరి, 9-30 అఖిలభారత సంగీత కార్యక్రమం (ఢి. వి.); 11-0సమాప్తి.

హైద్రాబాద్ - ఎ

405.4 మీ (740 కిలోసై)

ఉదయం: 6-30 సుప్రభాత్; 6-35 కార్యక్రమ వివరణ; 6-40 భక్తిరంజని; 7-0 తె. వా; 7-15 విజయవాడవలె; 7-45 సంగీతశిక్షణ; 8-0 ఆం. వా; 8-15 హిం. వా; 8-30 బాలానందం; మధ్యాహ్నం: 12-30 కార్మికులకు; 1-0 స్త్రీలకు (వి. వి); 1-30 లలిత్ సంగీత్; 1-50 తె. వా; 2-0 వయొలిన్; 2-10 ఉ. వా; 2-20 'బొమ్మరిల్లు' (వి. వి); సాయంత్రం: 6-0 స్థానిక ప్రకటనలు; 6-5 ప్రాం. వా; 6-15 'నగరవాణి'; 7-0 తె. వా; 7-15 ఘజల్; 7-30ప్రసంగం(వి వి.); 7-40 ప్రసంగం(హిందీ); 8-0శ్రోతలు కోరిన పాటలు; 8-0 ఆంగ్లప్రసంగం; 8-10 వినోదగాన్; 8-15 ఆంగ్ల ప్రసంగం; 8-30 రేడియో న్యూస్‌రీల్; 8-40 విరామసంగీతం; 8-45 'జాతీయ ప్రసంగ కార్యక్రమం'; 9-0 ఆం వా; 9-15 ఉ. వా; 9-30 విజయవాడ వలె; 11-0 సమాప్తి.

హైద్రాబాద్ - బి

42.02 మీ (7140 కిలోసై)

ఉదయం: 6-30 సుప్రభాత్.

30 86 మీ (9720 కిలోసై)

మధ్యాహ్నం: 12-30 కార్మికులకు; 2-0 వయొలిన్; 2-20 విజయవాడవలె.

65 14 మీ (4[illegible] కిలోసై)

సాయంత్రం: 6-0 స్థానిక ప్రకటనలు; 6-15 గ్రామస్థులకు; 7-0 తె. వా; 7-15 గ్రామస్థులకు; 7-30 విజయవాడవలె; 7-40 ఎ. వి. సావిత్రి; 7-40 ప్రసంగం (హిందీ); 9-15 విజయవాడవలె; 9-30 ఢిల్లీనుండిరిలే, 11-0 సమాప్తి.

బజారు ధరలు

విజయవాడ, డిసెంబరు 17
(మధ్యాహ్నం గం॥ 1 వరకు)

బంగారం ధరలు

మేలిమి పాట్లా		128	0	0
మూస		128	4	0
నవరసు		82	0	0
వెండి: 100 తులములు		204	8	0
తులము		2	1	0

ధాన్యం ధరలు

24 నెంబరు	రు	33	0	0
వంకసన్నాలు		32	0	0
12 నెంబరు		31	0	0
అక్కుళ్ళు		28	0	0
కొత్తవి		28	0	0
కుసుమ		28	0	0
కొత్తవి		28	0	0
గోమణి		28	0	0

బియ్యం ధరలు

24 నెంబరు		80	0	0
వంకసన్నాలు		74	0	0
12 నెంబరు		70	0	0
అక్కుళ్ళు		68	0	0
కుసుమ		68	0	0

అపరాల ధరలు

మినుములు 240 సే॥		49	0	0
కందులు	85/-	48	0	0
పెసలు(మాగాణి)		50	0	0
పచ్చపెసలు 280 సే॥		44	0	0
పచ్చపెసలు (మెట్టవి)	42/-	45	0	0
శెనగలు (కేశవాళి) ఎర్రవి		45	0	0
శెనగలు (పంజాబు)		85	8	0
ధనియాలు26కుంచాలు సే॥		54	0	0
వులవలు	86/-	41	0	0
ఆముదాలు		47	0	0
పంచదార (వుయ్యూరు)		118	04నపై	
కొబ్బరినూనె డబ్బా		40	2	0
వెల్లుల్లి మణుగు	8-8-0	9	0	0
బెల్లం "	5-8-0	7	6	0
మిర్చి "	28/-	38	0	0
నీరుల్లి	2-6-0	8	0	0
చింతపండు (మ॥)	18-0-0	19	0	0
నువ్వులనూనె ,,		36	0	0
వేరుశనగపప్పు 177 సే॥				
జగ్గయ్యపేట		68	8	0
కోదాడ		64	0	0
నూనె మణుగు		17	8	0
కేక్ 160 సేసులు		24	8	0
కొబ్బరికాయలు1000		175	0	0
పంచులు 100		110	0	0
డిటో ఫార్వర్డు		102	0	0
తవుడు 2 వ పట్టు		12	0	0

అడవి దుంపలు తిని బ్రతుకుతున్న కోయలు

పాల్వంచ, ఇల్లెందు తాలూకా అడవి ప్రాంతాలలో కరువు పరిస్థితి

ఖమ్మంమెట్టు, డిసెంబరు 15

ఖమ్మంజిల్లా పాలవంచ, ఇల్లెందు తాలూకాలకుచెందిన అడవి ప్రాంతాలలో ఈ సంవత్సరం పంటలు పండక కోయప్రజలు దుంపగడ్డలు తెచ్చుకొని తిని బ్రతుకుతున్నారు.

సుజాత్‌నగర్ ప్రాంతీయ కమ్యూనిస్టు సమితి సమావేశం యీ నెల 10వ తేదీన జూలూరులో శ్రీ కేశవనారాయణ గారి అధ్యక్షతను జరిగింది. జిల్లా కమ్యూనిస్టు సమితి సెక్రటేరియట్ సభ్యులు శ్రీ బి. వెంకటేశ్వరరావు దేశ రాజకీయ పరిస్థితిని గురించి, పార్టీ నిర్మాణ పద్ధతులను గురించి రిపోర్టు యిచ్చారు. ఈ ప్రాంతంలోని పంటల పరిస్థితిని గురించి, రాబోయే కరువు పరిస్థితిని గురించి ప్రాంతీయ సమితి కార్యదర్శి శ్రీ మహమ్మద్ సులేమాన్ గారు వివరించారు.

తరువాత యీ దిగువ తీర్మానం చేశారు:

"ఈసంవత్సరం పాలవంచ, ఇల్లెందు తాలూకాల అడవి ప్రాంతాలలో పునాసపైర్లు రైతుచేతికి రాకుండా పాడైపోయినవి. అధికవర్షాలవల్ల తరుణంలో దుక్కులు అవక అనేక ఇబ్బందులలో కొంతపొలాన్ని మాత్రమే సాగుచేయవలసి వచ్చింది. నాలుగోవంతు భూమి బీడుపడిపోయింది. ఇన్ని యిబ్బందులకోర్చి వేసిన జొన్నపైరు వేసిన నాటినుండి నేటివరకు వర్షంలేక పోవడంవల్ల చేలన్నీ ఎండిపోతున్నవి. రైతుకు విత్తనాలు మళ్ళీ పరిస్థితి లేదు. ఈ సందర్భంలో పెట్టుబడిదారులు తమ వద్ద నిల్వవున్న ధాన్యాన్ని అధిక ధరలకు అమ్ముతున్నారు ఇప్పటికే యీప్రాంతంలో నివసించుచున్న కోయప్రజలు అడవులలోని దుంపగడ్డలను తెచ్చుకొని తిని బ్రతుకుతున్నారు. కూలీవాలీ దొరక్క నానాఅవస్థలు పడుతున్నారు. ఈ సమయంలోనే రూపాయికి రెండు శేర్లు అయినా జొన్నలు దొరకడం లేదంటే ముందుముందు పరిస్థితులు ఎలా వుంటవో ఊహించలేము.

అడవిప్రాంతంలో ఏర్పడిన యీ విపత్కర పరిస్థితిని ప్రభుత్వం గమనించి యీక్రిందిచర్యలు తీసుకొని ప్రజలను కరవువాత పడకుండా ఆదుకోవాలని కోరుతున్నాము. పంటలు పాడయిపోయిన ప్రాంతాలన్నిటా యీసంవత్సరం శిస్తురెమిషన్ ఇవ్వాలి. పాలవంచ, ఇల్లెందు తాలూకాలలో యిప్పటికే మంత్రులచే శంకుస్థాపనలు చేయించి పని జరపకుండా వున్న ప్రాజెక్టులను, చెరువులను మరమ్మతు చేయించుటద్వారా ప్రజలకు కరవు పనులు కల్పించాలి. ప్రతి గ్రామంలో చౌకడిపోలు స్థాపించి, ప్రతి పేద కుటుంబానికి మూడు రూపాయలు తక్కావీ అప్పులు యివ్వాలి."

"రక్తకన్నీరు" నాటక బృందానికి సన్మానం

విజయనగరం, డిసెంబరు 14

ఆంధ్రప్రదేశ్‌లో పలుకేంద్రాలలో 'రక్తకన్నీరు' నాటకమును ప్రదర్శించి ప్రేక్షకుల మన్ననలను పొందిన రవి ఆర్టు థియేటర్సు (మద్రాసు) వారి బృందమునకు స్థానిక కమ్యూనిస్టుపార్టీ కార్యాలయంలో 11 వ తేదీ సాయంకాలం సన్మానం చేయబడినది. డా॥ జె. వి. లక్ష్మిఅధ్యక్షత వహించారు.

తాలూకా కమ్యూనిస్టుసమితి కార్యదర్శి మాట్లాడుతూ యీ ప్రదర్శనలు ప్రజలను సాంఘికంగాను, నైతికంగాను చైతన్యవంతులుగా చేయుటకు తోడ్పడుతాయని అభిప్రాయము వెలిబుచ్చారు. శ్రీ నాగభూషణంగారు తమకు సన్మానం చేసినందుకు కృతజ్ఞత వెలిబుచ్చుతూ తాలూకా కమ్యూనిస్టు పార్టీకి అర్ధనూటపదహార్లు బహూకరించారు.

విజయనగరం హాస్టల్ హాలులో కూడా సన్మానం జరిగింది. శ్రీ వి. అచ్యుతరావుగారు, నాగభూషణంగారికి శిల్కు శాలువను బహూకరించినారు.

స్థానిక బోర్డు వారి సత్రంలో వుంటున్న నాటక సమాజం వారివి. (శ్రీ నాగభూషణం గదిలో) 17 వందల రూపాయిల నగదు, సుమారు 18 వందల విలువ చేసే బంగారు వస్తువులు బట్టలు వగైరా సామాన్లు పోయినవి. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. (వి. వి.)

శ్రీ శంకరయ్యగారి నిరాహార దీక్షను బలపరచండి

గుంటూరు, డిసెంబరు 14

గుంటూరుజిల్లాలో పేరాలలో శ్రీ గోలి శంకరయ్యగారి నిరాహారదీక్షను చేనేత కార్మికులు, తదితరులు బలపరచాలని కోరుతూ జిల్లా చేనేతసంఘ కార్యదర్శి శ్రీ గంజి ముసలయ్యగారు ఒక ప్రకటన చేశారు.

కిర్లంపూడిచక్కెరఫ్యాక్టరీ సమ్మె ఉపసంహరణ

పిఠాపురం, డిసెంబరు 14

ఇక్కడికిర్లంపూడి షుగర్ మిల్సులో పనివారలకు, ప్రస్తుతం గుమాస్తాలకు యిచ్చెడి కరువుభత్యం రు 42 లను రు 47 లకు, మరొక రు 5½ లు హెచ్చుచేయుటకు, 85 రోజులు వేతనం పారితోషికంగా యిచ్చుటకున్నూ, సీనియారిటీని గత ఒడంబడికల ప్రకారం గుర్తించుటకు, లోడింగు, అన్‌లోడింగు వగైరా పీసురేటు పనివారలను ఫ్యాక్టరీ కార్మికులుగా గుర్తించి యితర సౌకర్యములను కల్పించుటకు రాజమండ్రి కన్సిలియేషన్ ఆఫీసరుగారు ఉభయులకురాజీచేశారు. తత్ఫలితంగా వర్కర్సు యూనియన్ వారు లోగడ యిచ్చిన సమ్మె నోటీసు నుపసంహరించుకొన్నారు.

చెరుకు ఉత్పత్తిదారుల కోర్కెలకు మిల్లుఅంగీకారం

పిఠాపురం, డిసెంబరు 14

పిఠాపురంలోని కిర్లంపూడి షుగర్ మిల్లుకు చెరుకు ఉత్పత్తిదార్లు సరఫరా చేసిన చెరుకునకు ప్రభుత్వ ఉత్తర్వు ప్రకారం 14 రోజులలోపున డబ్బు యిచ్చివేయవలెనని, బండ్లఅద్దెలు అందరికీ యివ్వాలని, యివ్వనిచో చెరుకు సరఫరా చేయమని మేనేజిమెంటుకు చెరుకు ఉత్పత్తిదార్ల సంఘం నవంబరు 24 న నోటీసుజారీచేశారు. తత్ఫలితంగా చెరుకు మూడు రోజులపాటు సరఫరా ఆగిపోయింది. మేనేజిమెంటువారు ప్రభుత్వ ఆదేశ ప్రకారం చెరుకునకు డబ్బు యిచ్చివేస్తామని, బండ్ల అద్దెలను డైరక్టరు బోర్డువారికి వ్రాస్తామని, అంగీకరించుటచే చెరకును మరల తోలుటకు చెరుకు ఉత్పత్తిదార్ల సంఘమునకు, మేనేజిమెంటుకు రాజీ జరిగింది.

ఖమ్మం ఆంధ్ర బాలికోన్నత పాఠశాల

ఖమ్మంమెట్టు, డిసెంబరు 14

ఖమ్మం ఆంధ్ర బాలికోన్నత పాఠశాలను ప్రభుత్వం స్వాధీనపరచుకోవాలని యిచ్చట ప్రజలు ఆందోళన చేస్తున్నారు.

ఈపాఠశాలను స్థాపించి 15 సంవత్సరాలు దాటింది. ఆనాడు కొద్దిమంది విద్యార్థినులచే ప్రారంభించబడిన యీ పాఠశాల విద్యార్థినులధికమై నేడు 500 కు మించింది. మొదట స్థాపించిన పాఠశాల భవనం సరిపోక ఇటీవల మరొక పెద్దభవనం కట్టించారు. ఈ పాఠశాల అభివృద్ధికొరకు అనేకమంది దాతలు విరాళా లిచ్చి తోడ్పడ్డారు. కాని, యీ పాఠశాల కమిటీవారు విద్యార్థినుల చదువును గురించి గాని, సౌకర్యాలనుగురించిగాని పట్టించుకోవడం లేదు.

ఇంతేగాక, స్కూలుకమిటీ కార్యదర్శి తమ స్వార్థ బుద్ధితో ఉపాధ్యాయులకు సరిగా జీతాలు యివ్వకపోవడం, అక్రమంగా తొలగించడం పరిపాటైపోయింది. ఈ స్కూలులో పనిచేస్తున్న ఉపాధ్యాయినులు వై. పుల్మణమ్మ, మృణాళినీ భూషణీ బి.ఏ. బి.ఇ.డి. గార్లను మూడు సంవత్సరాల నాడు అక్రమంగా తొలగించారు. ఈ అక్రమాన్ని ప్రభుత్వానికి విన్నవించుకొనగా మరలను తిరిగి ఉద్యోగంలోనికి తీసుకోవలసిందిగా ఉత్తర్వు వచ్చినట్లు తెలుస్తున్నది. అయినా నేటికీ ఉద్యోగంలోనికి తీసుకోలేదు. మూడు సంవత్సరాల నుంచి వుంటున్న ఉపాధ్యాయులను నేటికీ ఖాయపరచలేదు. ఇంక్రిమెంట్లు కూడా యివ్వడంలేదు.

500 కన్నా అధికంగా విద్యార్థినులు వున్న యీ పాఠశాలలో 19 మంది మాత్రమే ఉపాధ్యాయులు వున్నారు. స్టాఫు తక్కువగా వుండటం మూలాన ఒక్కొక్క ఉపాధ్యాయిని 81 పీరియడ్లు పనిచేయవలసి వస్తున్నది. దీని మూలాన ఇటు టీచర్లకు చాలా కష్టంగా వుండటమేగాక విద్యార్థినులకు సరైన విద్యకూడా లభ్యమవడం లేదు.

స్కూలు లెక్కలు జమ, ఖర్చులు కూడా సరిగాలేవని. చాలా దుబారా జరిగిందని చాలామంది భావిస్తున్నారు. ఆడిట్ కూడా జరిగినట్టు లేదని భావించబడుతున్నది.

పాఠశాలలో ఫర్నిచరు కూడా సరిపోయినంతగా లేదు. రెండు బ్రాంచీలుగా నడుస్తున్న యింత పెద్ద పాఠశాలకు యిద్దరు మాత్రమే చపరాసీలు వున్నారు. బ్రాంచి స్కూలులో గడియారం కూడా లేదు. (వి. వి.)

ఏలూరు పట్టణ ప్రాథమిక ఉపాధ్యాయుల విజయం

నిరాహార వ్రత విరమణ

ఏలూరు, డిసెంబరు 15

ఏలూరులోని జ్వాలాపహరేశ్వర పాఠశాల ఉపాధ్యాయులు ఆరుగురు నేటినుండి నిరాహారవ్రతం చేస్తామని యిచ్చిన నోటీసుపై విద్యాధికార్లు సత్వరం తగు చర్యలు తీసికొన్నందున నిరాహార వ్రతాన్ని విరమించారు.

ఉపాధ్యాయులు పాఠశాల బిల్డింగ్ మార్పు అంగీకరించి జీతాలు బట్వాడా చేయించాలని, సర్వీసునుండి తొలగించుతావని మేనేజరుచే యివ్వబడ్డ నోటీసులు రద్దుచేయించాలని, పాఠశాల ప్రభుత్వపరం గావించుకోవాలని, అలా డిసెంబరు 15 లోగా వీటిని అధికారులు పూర్తిచేయకపోతే డి. ఇ. ఒ. ఆఫీసుముందు ఆతేదీనుండి నిరాహార వ్రతం సాగించుతామని అధికారులకందరకు నోటీసులు పంపుకున్నారు.

ఇంతటితో అధికారులు కదలి, పాఠశాల బిల్డింగు మార్పు అంగీకరించుతూ ఉపాధ్యాయులందరకు జూన్ నుండి నవంబరు వరకు జీతాలు పంపించారు. నెల నోటీసులు రద్దు చేయించి, పాఠశాల ప్రభుత్వపరం చేసుకొనే హామీ నిచ్చారు. దీనితో డిసెంబరు 15 వ తేది నుండి సాగించవలసిన నిరాహార వ్రతాన్ని ఉపాధ్యాయులు విరమించుకున్నారు.

జ్వాలాపహరేశ్వర జూనియర్ బేసిక్ పాఠశాల మేనేజరు శ్రీ గజ్జల ప్రసాదరావుగారు పాఠశాల యింటి అద్దె చెల్లించని కారణంగా యింటి ఖామందు కోర్టులో దావావేసి యిల్లు ఖాళీచేయించినారు. పాఠశాలను మరొక యింటికి మార్చిన మార్పుకు అధికారుల ఆమోదం లేనందున జూన్ నెలనుండి తొమ్మిదిమంది ఉపాధ్యాయులకుజీతాలులేవు.

మేనేజరుగారు ఉద్యోగం ప్రతి సంవత్సరం యిస్తానని ప్రతివారి వద్ద ప్రతి జనవరిలో తీసుకొనే రూ. 100 లు, నెలకు తీసుకొనే రు. 8 లు, గాక ప్రభుత్వం సప్లయి చేసిన క్రాఫ్టు పరికరాలు దుర్వినియోగం చేసిన విషయం ఉపాధ్యాయులు అధికారులకు బుజువు పరచుకున్నారు. అందుమీద డి. యి. ఓ., స్పెషల్ డి.యి.ఓ., గారలు వచ్చి పాఠశాల ప్రభుత్వపరం చేసుకుంటామని హామీ నిచ్చారు.

అయినా డిసెంబరువరకు అధికారులు కదలనందున మేనేజరుగారికి ధైర్యంవచ్చి ఉపాధ్యాయులనుసర్వీసు నుండి తొలగించుతానని నెలనోటీసులు జారీచేశారు.

పట్టణ ఉపాధ్యాయ సంఘం, యీ విషయంలో నిలబడి సహకారమిచ్చినందులకు, యిక ముందు మేనేజరుగారికి యివ్వవలసిన మామూళ్ళు తప్పించినందులకు ప్రతి ఉపాధ్యాయుడు పదిరూపాయలు విరాళం సంఘానికి యిచ్చారు. (వి. వి)

సభలు సమావేశాలు

సత్తెనపల్లి తాలూకా కమ్యూనిస్టు పార్టీ సర్వసభ్య సమావేశం ఈ నెల 22 వ తేదీ పగలు ఒంటిగంటకు సత్తెనపల్లిలో జరుగుతుంది.

◆ ◆ ◆

మార్కాపురం తాలూకా రైతు సంఘం సమావేశము డిసెంబరు 21 న అన్నసముద్రము గ్రామములో జరుగుతుంది.

◆ ◆ ◆

విశాఖజిల్లా గజపతినగరం సబ్ తాలూకా గ్రామోద్యోగుల సమావేశం డిసెంబరు 20 న గజపతినగరంలో శ్రీ ధనరాజు పఠనమందిరంలో జరుగును.

◆ ◆ ◆

ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంఘ కార్యవర్గ సమావేశం ఈ నెల 20 వ తేదీ వుదయం 10 గంటలకు గుంటూరుజిల్లా, తెనాలి కృషిక్ నగర్‌లో శ్రీ యడ్లపాటి వెంకటరావు గారి ఇంటివద్ద జరుగుతుంది.

◆ ◆ ◆

ఆంధ్రప్రదేశ్ 'హాస్టళ్ళ' మేనేజర్ల సర్వసభ్య సమావేశం ఈనెల 21 వ తేదీ సాయంత్రం 4 గంటలకు హైదరాబాదు గాంధిభవనంలో జరుగుతుంది.

◆ ◆ ◆

ఆంధ్రప్రదేశ్ గీత పారిశ్రామిక సంఘ కార్యవర్గ అత్యవసర సమావేశం ఈ నెల 20 వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు గుంటూరుజిల్లా తెనాలి, కృషిక్ నగర్ లో శ్రీ యడ్లపాటి వెంకట్రావు యింటివద్ద జరుగుతుంది.

◆ ◆ ◆

మహబూబునగరు జిల్లా కల్వకుర్తి తాలూకా కేంద్రంలో ఈనెల 27, 28 తేదీలలో తాలూకా రైతు సంఘ మహాసభ జరుగుతుంది. 26 రాత్రి 8 గంటలకు ప్రతినిధులంతా కల్వకుర్తి చేరుకోవాలి.

◆ ◆ ◆

అచ్చంపేటతాలూకా రైతు మహాసభ ఈనెల 29, 30 తేదలలో అచ్చంపేటలో జరుగుతుంది. ప్రతినిధులంతా 28 రాత్రికి రావాలి.

క్రీడారంగం

విశాఖ అంతర్‌పాఠశాలల క్రిగ్ ఆటలపోటీలు

విశాఖపట్నం, డిసెంబరు 15

విశాఖపట్నంజిల్లా అంతర్ పాఠశాలల క్రిగ్ ఆటలపోటీలు ఈనెల 2 నుండి 8 వ తేదీవరకు విశాఖపట్నం మునిసిపల్ స్టేడియంలో జరిగాయి. సుమారు 24 హైస్కూళ్ళ నుండి 600 మంది విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు.

బహుమతి ప్రదానోత్సవానికి స్టేట్ ట్రేడింగ్ కార్పొరేషన్ రీజినల్ మేనేజర్ శ్రీ ఎస్. కె. సేన్ అధ్యక్షత వహించారు. జిల్లా విద్యాశాఖాధికారి శ్రీ జి. ఎస్. పట్నాయక్ ఉపన్యసించారు. జిల్లా పరిషత్ సభ్యురాలు శ్రీమతి టి. వి. రమణమ్మ బహుమతులు పంచిపెట్టారు.

ఇంటర్ ఛాంపియన్‌షిప్ పతకం శ్రీ ఎస్. వై. రావు (సి. బి. ఎం. హైస్కూలు)కు. క్రిగ్ పతకం శ్రీ ఎల్. సన్యాసిరావు (ఎ. వి. ఎన్. కాలేజి హైస్కూల్)కుఇవ్వబడ్డాయి. ఆల్‌రౌండ్ ఛాంపియన్‌షిప్ షీల్డులు సి. బి. ఎం. హైస్కూలుకు ఇవ్వబడ్డాయి.

ఓపెన్ టేబుల్ టెన్నిస్ కేరమ్స్ పోటీలు

విజయవాడ. డిసెంబరు 15

విజయవాడ సదరన్ రైల్వే ఇన్‌స్టిట్యూట్ లో ఈనెల 13వ తేదీ ఓపెన్ టేబుల్ టెన్నిస్, కేరమ్స్ పోటీలు జరిగాయి.

సదరన్ రైల్వే డివిజనల్ పర్సనల్ ఆఫీసరు శ్రీ ఆర్. కణ్ణన్ బహుమతులు పంచిపెట్టారు.

పెద్దపల్లిలో కరీంనగర్ జిల్లా టోర్నమెంట్సు ప్రారంభం

హైద్రాబాదు, డిసెంబరు 14

కరీంనగర్ జిల్లా మొత్తము స్కూళ్ల యొక్క ఆటలపోటీలు ఇక్కడి పెద్దపల్లిలో ప్రారంభమైనవి.

పై టోర్నమెంట్సులో మొత్తము 37 స్కూళ్ళు వివిధ ఆటలలో ఎన్నో టీములు పాల్గొంటున్నవి. ప్రతిరోజు వివిధస్కూళ్ల విద్యార్థులు ఒకవారం వరకు ఏకాంక నాటికలు ప్రదర్శిస్తారు.

కేరళ ఎన్నికల నిధికి తిరుపతి విద్యార్థుల రు. 100 ల విరాళం

తిరుపతి, డిసెంబరు 15

కేరళ కమ్యూనిస్టుపార్టీ ఎన్నికల నిధికి చిత్తూరుజిల్లా తిరుపతి నుండి విద్యార్థులు రు. 100 లు పంపించారు.

గోపీచంద్ అనే విద్యార్థి విద్యార్థుల వద్ద రు 80 లు, పట్టణంలో రు 20 లు వసూలుచేశారు. యింకా చాలామంది విద్యార్థులను కలుసుకోనలేదు. కారణం తగిన నిర్మాణం లేకపోవడమే.

జానకీపురం

కేరళ ఎన్నికల నిధికిగాను మధిర తాలూకా జానకీపురం కాపురస్థుడు శ్రీపాటిబండ్ల రఘుపతిరావుగారు మనియార్డర్ ద్వారా రు. 100 లు పంపినారు.

చిరువోలులంక

కేరళ కమ్యూనిస్టుపార్టీ ఎన్నికల ఖర్చులకోసం దివితాలూకా కమ్యూనిస్టుసమితివారు రు 50 లు విరాళం పంపించారు.

పాలమూరు శ్రీ రామకృష్ణ సేవాసమితి ధర్మాస్పత్రి

పాలమూరు, డిసెంబరు 14

పశ్చిమగోదావరిజిల్లా పాలమూరు శ్రీ రామకృష్ణ సేవాసమితివారిచే నడుపబడుచున్న శ్రీ శారదా రామకృష్ణ ధర్మాస్పత్రికి ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ సంస్థ ఉపాధ్యక్షురాలు శ్రీమతి అద్దేపల్లి వివేకానందదేవి గారు 9వతేదీన అరుదెంచిరి. ఈధర్మాస్పత్రికి మార్చి 29 న శ్రీ చిరంతనానందస్వామివారిచే ప్రారంభోత్సవం జరుపబడింది.

ఈ ఆసుపత్రి ద్వారా అప్పుడే సుమారు 5000 మందికి ధర్మముగా వైద్య సహాయము అందింది. శ్రీమతి వివేకానందదేవిగారు ఈ ఆసుపత్రి చూచి నిష్కామసేవ చేస్తున్న ఈ ఆసుపత్రికి తప్పక సహాకారం గావించుతామన్నారు. ఈనాడు ఈ ఆసుపత్రిలో ముగ్గురు ఉన్నత తరగతికి చెందిన డాక్టర్లు సేవ చేయుచున్నారంటే, అనేక పెద్దపెద్ద మందుల కంపెనీలవారు సహాకారం చేయుచున్నారంటే ఈ సంస్థ వారి సేవా విధానమే కారణమన్నారు.

కార్యదర్శి శ్రీ కె. రామమూర్తి గారు సహాకారము గావించినవారికి తమ కృతజ్ఞత తెలిపారు.

—మైసూరులో జరుగుతున్న అంతర్జాతీయ యువజనోత్సవాలు నేటితో ఆఖరైనవి.

జగ్గయ్యపేట

జగ్గయ్యపేటలో వ్యాయామ అభిలాషులు సమావేశమై శ్రీ చిల్లకంటి పూర్ణచంద్రరావుగారిని అధ్యక్షులుగా శ్రీ జి. వి. యస్. నాగేశ్వరరావుగారిని కార్యదర్శిగా యెన్నుకొన్నారు శ్రీ డి. నరసింహారావుగారు యోగాసనాలు ప్రదర్శించి సభికులను ఉత్తేజపర్చారు. ప్రతిరోజూ సభ్యులకు వ్యాయామశిక్షణ ఇస్తున్నారు.

వి. జి. యస్. గైడ్సు

రైల్వేసర్వీసు కమిషన్ కంప్లీట్ గైడ్ 2-00 మినిష్టీరియల్ సర్వీసు కమిషన్ కంప్లీట్ గైడ్ 1-50 S. S. L. C. 1960 మార్చికి, ఇంగ్లీషు గోడన్‌గైడ్ (పాకెట్ సైజు) 0-75.

మరా: పుస్తకంకేటు పంపిన యెడల బుక్‌పోస్టులోను 0-50 నయా పైసలు ఎగస్ట్రా పంపించిన యెడల రిజిష్టర్డు బుక్‌పోస్టులో పంపబడును.

విశాలాంధ్ర జనరల్ స్టోర్సు,
అమలాపురం, తూ॥గో॥జిల్లా.

టీచర్ సర్టిఫికెట్ దొరికినది

బండ్లమూడి గ్రేస్ సంజీవమ్మ అనే పేరుతోనున్న ఒక హైయర్ ఎలిమెంటరీ గ్రేడ్ టీచర్ సర్టిఫికేట్ రిజిస్టరు దొరికినది. దీనికి సంబంధించిన వారు గుర్తులుచెప్పి ఖర్చులుయిచ్చి విజయవాడ విశాలాంధ్ర ఆఫీసువారినుండి పొందవచ్చు.

రెండవ కూర్పు

'పంచాయతీపరిపాలనము'

రచయిత:
కె. విశ్వనాధం, బి. యస్‌సి.
(మాజీ జిల్లాపంచాయతీ ఆఫీసరు)

గ్రామ పంచాయతీ చట్టము, రూల్సు, గవర్నమెంటు ఉత్తర్వులను అనుసరించి, పంచాయతీ అధ్యక్షులకు, ఉపాధ్యక్షులకు, సభ్యులకు, ఎగ్జిక్యూటివ్ ఆఫీసరులకు, గుమాస్తాలకు మార్గదర్శకముగా ఉండుటకై వ్రాయబడిన పుస్తకము. కీ॥ శే॥ శ్రీ నరసింహదేవర సత్యనారాయణగారు రాష్ట్ర పంచాయతీ యూనియన్ మాజీ అధ్యక్షుడు పుస్తకము మొదటి కూర్పును గురించి యిలా వ్రాశారు:

"గ్రామ పంచాయతీ పరిపాలనా వ్యవహారములలో ఆరితేర దివ్వగించు ప్రతి పంచాయతీదారు యీగ్రంథమును అనుదినం పారాయణచేసిన ధన్యుడగును."

నూతనముగా ఎన్నుకొనబడిన పంచాయతీ అధ్యక్షులు ఏమి చేయవలెను అను అంశముమీదను, పంచాయతీ సమితుల మీదను ప్రత్యేక అధ్యాయము లున్నవి.

వెల: రూ. 12.75 (వి. పి. పి. ద్వారా రూ. 15/-)

ప్రతులకొరకు ఈ అడ్రసుకు వ్రాయవలెను.

దుర్గా బుక్ డిపో,
17, అంగప్పనాయక్ వీధి, మదరాసు-1.

మీకున్నూ—సినిమా తారవంటి
మనోహరమైన చర్మసౌందర్యము!

స్త్రీ సొగసుకు అవసరైన మనోహరమగు చర్మ సౌందర్యము ముఖ్యాంశము ఆమె ఇలా చెప్పుచున్నది. "నా చర్మ సౌందర్యము కోసం నేను లక్సు టాయిలెట్ సబ్బును వాడుచున్నాను దాని మృదువైన మీగడవంటి నురగ నాకు ఇష్టము అది నా చర్మమునకు చాలా మంచిది." లక్సుయొక్క నురగ మీ చర్మమునకు మనోహరమైన కాంతిని గలిగించునవియు. దాని సౌమ్యమైన పరిమళము మిమ్ములను ప్రాతఃకాలపు హాయిగానుంచునవియు మీరు కూడా తెలిసికొండు మీ చర్మ సౌందర్యముకోసం లక్సును ఎందుకు వాడ ాదు?



శుద్ధమైన,తెల్లని,
లక్సుటాయిలెట్ సబ్బు
సినిమా తారలకు సౌందర్యమునిచ్చే సబ్బు

హిందూస్తాన్ లీవర్ లిమిటెడ్ వారి తయారీ

వరకట్నం నిర్వచనపై లోక్‌సభ రాజ్యసభలకు విభేదం

న్యూఢిల్లీ, డిసెంబరు 16

వివాహ సందర్భంలో వరునికి ఇచ్చే కానుకలు వరకట్న నిర్వచనం క్రిందికి రాకూడదని లోక్‌సభలో వరకట్న నిషేధం బిల్లుకు చేసిన సవరణను రాజ్యసభ నేడు బిల్లునుంచి తొలగించివేసి, ఆ తరువాత బిల్లును ఆమోదించింది.

రాజ్యాంగ చట్టం ప్రకారం ఈ బిల్లు మళ్ళీ లోక్‌సభ ఆమోదం పొందవలసివుంది.

రాజ్యసభ వారు అంగీకరించిన రూపంలో బిల్లును తిరిగి లోక్‌సభ వారు ఆమోదించకపోతే, అప్పుడు పార్లమెంటు ఉభయసభల సంయుక్త సమావేశాన్ని జరుపుతారు. ఆ సమావేశంలో మెజారిటీ నిర్ణయాన్ని అనుసరించి బిల్లు ఆమోదించబడుతుంది.

వివాహ సందర్భంలో వరునికిచ్చే కానుకలు వరకట్నంగా పరిగణించకూడదని లోక్‌సభ బిల్లులో చేర్చిన కొత్త క్లాజును తొలగించాలని కమ్యూనిస్టు సభ్యులు రాజ్యసభలో నేడొక సవరణ తెచ్చారు. సవరణపై మూజువాణీ ఓటు తీసుకొన్న తరువాత సవరణ నెగ్గినట్లు అధ్యక్షుడు ప్రకటించారు.

దీన్ని ఎవ్వరూ కాదనలేదు. రాజ్యసభలోని అందరు స్త్రీలూ, చాలా మంది కాంగ్రెసుసభ్యులూ సవరణకు అనుకూలంగా ఓటు చేశారు.

అంతకుముందు బిల్లుపై జరిగిన చర్చకు న్యాయశాఖ మంత్రి శ్రీ ఎ. కె. సేన్ సమాధానం చెప్తూ, లోక్‌సభ కొత్తగా చేర్చిన ఈ నిబంధనపై ప్రభుత్వం తన సభ్యులు ఫలానా విధంగా ఓటు చేయాలనే ఆదేశం తాను ఇవ్వడంలేదని అన్నారు.

రాజ్యసభ తొలగించిన క్లాజు ఇది: "ఈ సందర్భంలో వరకట్నం విషయమై వచ్చే సందేహాల నివృత్తికై క్రింది ప్రకటన చేయబడుతున్నది.

వివాహ సందర్భంలో, వధూవరుల కుటుంబాలకైనా సరే, కానుకగా ఇచ్చే డబ్బు, ఆభరణాలు, వస్త్రాలు, ఇతర వస్తువులు ఈ క్లాజులో పేర్కొనబడిన వరకట్న పద నిర్వచన క్రిందికి రావు. అయితే అలా యిచ్చే కానుకలు వివాహానికి ఎదుటివారు అంగీకరించినందుకుగాను చెల్లించే ముడుపులుగా ఉండరాదు."

పై వివరణను తొలగించడం వల్ల మునుపు సంయుక్త సిఫార్సుల సంఘం వారు వరకట్నానికి యిచ్చిన నిర్వచనమే ఖాయమయినది.

ప్రదేశ్ వ్యవసాయ కార్మికసంఘ కార్యవర్గ సమావేశం వాయిదా

హైద్రాబాద్, డిసెంబరు 15

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘ అధ్యక్షులు శ్రీ గుంటూరు బాపనయ్యగారు యిలా వ్రాస్తున్నారు:

ఈనెల 20, 21 తేదీలలో జరుగవలసి వున్న ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘ సమావేశం వాయిదా వేయబడింది. కార్యవర్గ సమావేశం ఎప్పుడు జరుగుతుందో తరువాత తెలియజేయబడుతుంది (వి. వి)

హైద్రాబాద్, డిసెంబరు 16

మరో 10 సంవత్సరాలపాటు హరిజనులకు, గిరిజనులకు శాసనసభల్లోనూ, పార్లమెంటులోనూ నిర్దిష్ట స్థానాలను కేటాయించడానికి అంగీకరిస్తూ, ఆంధ్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తీర్మానాన్ని శాసనసభ నేడు ఏకగ్రీవంగా ఆమోదించింది.

హైద్రాబాదు ధరవరలు

(భారత్ గ్రెయిన్ ట్రేడింగ్ కంపెనీ, ఉస్మాన్‌గంజ్)

హైద్రాబాద్, డిసెంబరు 17

(పల్లా 120 శేర్లు)

నెం 24 బియ్యం	79-00	80-00
వంకసన్నాలు	79-00	80-00
అక్కుళ్లు మొదటిరకం	74-00	75-00
అక్కుళ్లు రెండవరకం	—	—
వరంగల్లు (1వ రకం)	84-00	86-00
వరంగల్లు 2వ రకం	78-00	80-00
సన్నబియ్యం (కొత్తవి)	76/-	80-00
దొడ్డుబియ్యం(కొత్తవి)	55-00	56-00
19 నెం. బియ్యం	58-00	59-00
నానాకురంబియ్యం	60-00	64-00
పాలఅక్కుళ్ళబియ్యం	56-00	57-50
సాంబార్లు 9	62-00	66-00
తెల్ల జొన్నలు	51-00	58-00
,,	41-00	42-00
పచ్చ జొన్నలు	39-50	40-50
పసుపు	102/-	118-00
కందులు పెద్దవి	50-00	51-00
కందులు చిన్నవి	42-00	48-00
పెసలు	47-00	49-00
మినుములు	48-50	51-00
శెనగలు	39-00	41-50
బెల్లం	55-00	60-00
మిర్చి	220/-	292-00
చింతపండు	180-00	220-00
ఉల్లిగడ్డలు	26-00	30-00
సజ్జలు	40-00	48-00
గోధుమలు బన్సీ	92-00	94-00
ఎర్రగోధుమలు	—	—
గోధుమలు పర్భణి	101/-	105-00
నువ్వులు (తెల్లవి)	90/-	97-00
కందిపప్పు పెద్దది	76/-	80-00
కందిపప్పు చిన్నది	62/-	66-00
శెనగపప్పు	49/-	50-00
పెసరపప్పు	67/-	69-00
మినపప్పు	68/-	70-00
అలంకిపిండి	—	54-00
ఏలకికాయ	—	58-25
బొబ్బర్లు	—	46-25
అల్లం	6-00	7-50
ఎల్లిగడ్డలు	9-50	11-00
పలకునూనె		17-00
ఆలుగడ్డ	4-25	4-75

ఆంధ్రప్రదేశ్‌లో ఉక్కు-ఫ్యాక్టరీకి తగినంత కాకిరాయి

కాని ఫ్యాక్టరీ స్థాపనకై రాష్ట్రప్రభుత్వం కోర్కెకు కేంద్రం తిరస్కృతి

హైద్రాబాద్, డిసెంబరు 16

భద్రాచలం రాజమండ్రి ప్రాంతంలో ఒక ఇనుము-ఉక్కు ఫ్యాక్టరీని స్థాపించవలసిందిగా ఆంధ్ర ప్రభుత్వం 1956 లోనే కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. కాని రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తికి కేంద్రం ఇంతవరకూ సమాధానంకూడా పంపలేదు.

శ్రీ వెల్లంకి విశ్వేశ్వరరావు ప్రశ్నకు శాసనసభలో శ్రీ బ్రహ్మానందరెడ్డి సమాధానం చెప్తూ ఈ విషయం వెల్లడించారు.

ఈ సమస్యను త్వరలో ప్రణాళికలో లేవనెత్తవచ్చునని అనుబంధ ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. కాకిరాయి ఎగుమతికి ప్రభుత్వం అనుమతించినప్పటికీ ఉక్కు ఫ్యాక్టరీకి కావలసినంత ముడి ఇనుము ఈ ప్రాంతంలో లభ్యమవుతుందని మంత్రి అన్నారు. కృష్ణాజిల్లా నందిగామలో, చిన్న ఇనుముఫ్యాక్టరీలు స్థాపించే విషయం ప్రభుత్వ ఆలోచనలోలేదని మరో ప్రశ్నకు సమాధానమిచ్చారు.

బందరులో మునిసిపల్ కార్మికుల సమ్మె

బందరు, డిసెంబరు 16

నిన్న బందరులో మ్యునిసిపల్ కార్మికులు స్వీపర్లు, తోటీలు డ్రైయినేజ్ కూలీలు, లారీ వర్కర్లు, బండ్లవర్కర్లు అందరూ షుమారు 800 మంది కార్మికులు సమ్మె చేశారు. మొత్తం పని యావత్తూ బంద్ అయింది.

సమ్మెచేసిన కార్మికులు "పే కమిటీ నివేదికను 1958 నవంబరునుండి తమకు అమలు జరపాలని" "కార్మికుల సంఖ్య పెంచాలని," "పనిభారం తగ్గించాలని" కోరుతూ నినాదాలిస్తూ పురవీధులలో ఊరేగింపు జరిపారు.

ఊరేగింపు అనంతరం శ్రీరామ విశ్వేశ్వర స్వామివారి ఆలయంఎదుట సభ జరిగింది. సభలో మ్యునిసిపల్ కౌన్సిలరు శ్రీయుతులు బడుగు లక్ష్మయ్య, కొడుమూడి శ్రీహరిరావు, ఆర్. రాములు, గుంటూరు మోకెన్, పి బాబు మొదలగువారు కార్మికుల కోర్కెలను గురించి మాట్లాడారు.

రాజమండ్రి

మునిసిపల్ కార్మికులు, ఆంధ్ర రాష్ట్ర మునిసిపల్ కార్మికసంఘ ఆదేశానుసారం నిన్న సమ్మెచేశారు. ఉదయం పట్టణ ముఖ్యవీధులగుండా 800 మంది పైగా ఊరేగింపుచేశారు.

విజయనగరంలో

విశాఖజిల్లా విజయనగరంలో మున్సిపల్ కార్మికులు సమ్మెచేశారు.

తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురంలో మునిసిపల్ కార్మికులు సమ్మెచేసి శ్రీ రంగాల సత్యనారాయణగారి నాయకత్వాన ఊరేగింపు చేశారు.

పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో 850 మంది మునిసిపల్ కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. తర్వాత ఊరేగింపు చేశారు.

గుంటూరులో ఉదయం 9 గంటలనుండి మధ్యాహ్నంవరకు మునిసిపల్ కార్మికులు బ్రహ్మాండమైన ఊరేగింపు జరిపారు. చంకలో పాపలనెత్తుకొన్న స్త్రీ కార్మికులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆనందపేటలో శ్రీ రావు నాగయ్యగారి అధ్యక్షతన బహిరంగసభ జరిపారు.

సామర్లకోటలోగూడా మునిసిపల్ కార్మికులు రాష్ట్రసంఘ ఆదేశానుసారం సమ్మె చేశారు.

గుంటూరుజిల్లా నర్సరావుపేటలో సమ్మె జరిగింది. బహిరంగసభ జరిపి తమ కోర్కెల నామోదించాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించారు.

మరికొన్నిచోట్ల

కొత్తపేట, చిలకలూరిపేట, చీపురుపల్లిలలోగూడా సమ్మెలు జరిగాయి.

తూలామ్ ప్రాజెక్టుకు ప్రస్తుతానికి తిలోదకాలు

హైద్రాబాద్, డిసెంబరు 15

వరంగల్ జిల్లాలోని, మహబూబాబాద్ తాలూకాలోని, తూలామ్ ప్రాజెక్టు నిర్మాణం ద్వితీయ పంచవర్ష ప్రణాళికా కాలంలో ప్రారంభింపబడదని నీటిపారుదల శాఖామాత్యులు శ్రీ జె. వి. నరసింగరావుగారు, ఆంధ్రశాసన మండలిలో ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. (వి. వి.)

భారతదేశానికి నౌకలు నిర్మిస్తానని పోలెండ్ వాగ్దానం

లోక్‌సభలో వెల్లడి

న్యూఢిల్లీ, డిసెంబరు 16

సముద్ర ప్రయాణంచేసే రవాణా నౌకలను, టాంకర్లను, రూపాయ చెల్లింపు పద్ధతిపై తాను నిర్మించి ఇస్తానని పోలెండు భారతదేశానికి వాగ్దానం చేసిందని లోక్‌సభలో మంత్రి రాజ బహదూర్ వెల్లడించారు.

కమ్యూనిస్టు సభ్యుడు శ్రీ దేవులపల్లి వెంకటేశ్వరరావుగారు వేసిన ప్రశ్నకు సమాధానంగా మంత్రి పై సమాధానం యిచ్చారు.

ఆజాద్, సరోజినీదేవి చిత్రాల ఆవిష్కరణ

న్యూఢిల్లీ, డిసెంబరు 16

పార్లమెంటు సెంట్రల్ హాలులో నేడు జాతీయ నాయకులు-మౌలానా ఆజాద్; శ్రీమతి సరోజినీ నాయుడు, శ్రీ సి. విజయరాఘవాచారియార్ గార్ల చిత్రపటాలను రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్ ఆవిష్కరించారు.

ఈ సందర్భంలో ఉపరాష్ట్రపతి డాక్టర్ రాధాకృష్ణన్, ప్రధాని నెహ్రూగార్లు మాట్లాడుతూ వారు ముగ్గురూ దేశానికిచేసిన సేవను ఉగ్గడించారు.

పింఛనుదార్ల సమస్య

హైద్రాబాదు, డిసెంబరు 16

పింఛనుదార్లు ప్రభుత్వానికి చెల్లించవలసిన బాకీలను వసూలు చేసుకోవడానికి వీలుకల్పిస్తూ పార్లమెంటు శాసనం చేయాలని బ్రహ్మానందరెడ్డి ప్రవేశపెట్టిన తీర్మానాన్ని కూడా శాసనసభ ఆమోదించింది.

ఈ తీర్మానం పైజరిగిన చర్చ సందర్భంలో శ్రీ పిల్లలమర్రి వెంకటేశ్వర్లు (కమ్యూ) మాట్లాడుతూ ఇలా అన్నారు:

"పింఛనులు చెల్లించేది రాష్ట్ర ప్రభుత్వం. అటువంటప్పుడు పింఛనుదారులు రాష్ట్ర ప్రభుత్వానికి డబ్బు చెల్లించవలసివుంటే, దాన్ని రాబట్టుకొనే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికెందుకు లేదు?"

రాష్ట్రాలకు సంబంధించిన వ్యవహారాలలోనే శాసనాలు చేసే అధికారం రాష్ట్ర శాసనసభలకు లేకుండా పోతున్నది. అందుకు ఇదొక ఉదాహరణ అని పలువురు సభ్యులు విమర్శించారు.

తీర్మానం ఓటుకు పెట్టగా 60 మంది అనుకూలంగానూ 13 మంది వ్యతిరేకంగానూ ఓటు చేశారు.

విమాన ఇంజన్లను భారతదేశంలోనే తయారుచేయడానికి త్వరలో ఒక బ్రిటిష్ కంపెనీతో భారతప్రభుత్వం ఒప్పందం చేసుకోబోతున్నది.

చైనా గ్రంథంలో మ్యాపులు

గ్రంథకర్త క్షమాపణ

న్యూఢిల్లీ, డిసెంబరు 16

"చైనా ఆధునిక చరిత్ర" అనే పుస్తకంలో. లడక్, నేఫా ప్రాంతాలను, బర్మాలోని కొన్ని ప్రాంతాలను చైనా భూభాగంగా, చూపించడం తప్పేనని ఇందుకు తాను చింతిస్తున్నానని, గ్రంథకర్త సియాంగ్ క్యాంగ్ భారత ప్రభుత్వానికి తెలియజేశారని హోంమంత్రి శ్రీ పంత్ నేడు రాజ్యసభలో తెలియజేశారు. ఈ గ్రంథకర్త ఢిల్లీవిశ్వవిద్యాలయంలో అధ్యాపకులు.

ఢిల్లీ పుస్తక దుకాణాలలో వున్న ప్రతులనుండి ఈ మ్యాపులను తొలగించామనికూడ మంత్రి అన్నారు.

పాలసీ పోయినది

కందుల నరసింహారావు అనే పేరుతో వున్న నెం. 957547 రు గల లైఫ్ యిన్సూరెన్సు కార్పొరేషన్ ఆఫ్ ఇండియాయొక్క యూనిటు అయిన ఓరియంటల్ గవర్నమెంటు సెక్యూరిటీ లైఫ్ యిన్సూరెన్సు కంపెనీకి చెందిన పై పాలసీ పోయినదని తెలియుచున్నది. ఒక మాసములోపల ఎవరి వద్దనుండైనా యెలాంటి అభ్యంతరం రానిచో తిరిగి పైవారికి, డూప్లికేటు పాలసీ యివ్వబడును.

కె. బాలసుబ్రహ్మణ్యం,
జోనల్ మేనేజరు.

డాక్టరుడిగ్రీపొందండి!
ఇంటివద్దనున్నప్పుడు పోస్టల్‌ట్యూషన్ ద్వారా ప్రభుత్వరిజిష్టర్డు కాలేజీనుండి డిప్లొమా పొందగలరు. ఉచిత ప్రాస్పెక్టసుకు వ్రాయండి.

INDIAN HOMEOPATHIC COLLEGE,
(VAV) JULLUNDUR CITY.


ఆంధ్ర ప్రజల నుర్రూతలూగించున్న మేటి చిత్రం
ఫిల్మాలయావారి
దిల్ దేకే దేఖో
షమ్మికపూర్ - ఆశా - పరేఖ్ (నూతననటి)
డైరెక్షన్ : నసీర్‌హుసేన్ (తుమ్‌సానహిదేఖా ఫేమ్)
మ్యూజిక్ : శంకర్‌జైకిషన్ (17 సం॥బాలిక)
నేటినుండి : 3 వ వారం
రాజమండ్రి
వీరభద్ర పిక్చర్ ప్యాలెస్
2 వ వారం
శ్రీ లీలామహల్, విశాఖపట్నం
త్వరలో . శేషమహల్ - గుంటూరు, న్యూ పూర్ణా - విజయవాడ, సత్యగౌరి - కాకినాడ, దాద్ - కర్నూలు
— పూర్ణా రిలీజ్




ప్రజలు పత్రికలు ప్రశంసిస్తున్న
అత్యుత్తమ పౌరాణిక చిత్రం..
2 వ వారం...
శ్రీరామాపిక్చర్స్ వారి
భక్త అంబరీష
మాటలు.... పద్మరాజు.. ఆచార్య.. గబ్బిట.
పాటలు. పద్యాలు.. ఆరుద్ర. పద్మరాజు.. గబ్బిట.
సంగీతం...... ఎల్. మల్లేశ్వరరావు.
నిర్మాత. దర్శకుడు.. బొళ్లసుబ్బారావు. బి.ఎ.
నెగిటివ్ రైట్స్
శ్రీకృష్ణా పిక్చర్స విశాఖ
KRISHNA
FLOODLIGHT

సంపాదకవర్గం: మోటూరు హనుమంతరావు (అధ్యక్షులు), కాట్రగడ్డ రాజగోపాలరావు, ఏటుకూరు బలరామమూర్తి: విశాలాంధ్రవిజ్ఞానసమితి తరఫున ఎడిటర్, ప్రింటర్ అండ్ పబ్లిషర్ కాట్రగడ్డ రాజగోపాలరావు, స్వతంత్ర ఆర్ట ప్రింటర్సు, విజయవాడ-2.